76809 94755 www.rajadhanivartalu.com rajadhanivartalu rajadhaniv RNI No. APTEL 2015/ 66622 స్థాపితం : 2015 Postal Regd No: GTR/84/2016-18

రాజధాని వార్తలు

Voice of Voiceless

అమరావతి సంపుటి : 4 సంచిక 4, పేజీలు 4, వెల: రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు వార పత్రిక సోమవారం 15 - ఆదివారం 21 అక్టోబర్, 2018

వివరాలు2లో...

ఈ ఏడాది నోబెల్ పురస్కారాలు

వివరాలు3లో...

అటవీ బామ్మ లక్ష్మీకుట్టీ వైద్యం

వివరాలు4లో...

దసరా ఉత్సవాలు

వివరాలు4లో...

మహోన్నత మానవతావాది కలామ్

ప్రమాదకరంగా పారిశుధ్యం

ఆందోళనలో నగర ప్రజలు

రాజధాని వార్తలు విజయవాడ : మున్సిపల్ కార్మికుల సమ్మెతో నగరంలో పారిశుధ్యం ప్రమాదకర స్థితిలో పడింది. పాలకులు, అధికారుల నిర్లక్ష్యం ప్రజలకు ప్రాణ సంకటంగా మారింది. పాతబస్తీలో మూడేళ్ళ బాలుడు డెంగీ పడటం ఇందుకు నిదర్శనం. ఒక్క పాతబస్తీలోనే కాదు నగరంలో ఎక్కడ చూసినా మలేరియా, టైఫాయిడ్, కామెర్లతో ప్రజలు అల్లాడుతున్నారు. మురికివాడల్లో పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారింది. వారం రోజులుగా నగరంలో చెత్త సేకరణ లేక ప్రతి వీధిలో చెత్తకుప్పలు పెరిగాయి. ఇంటింట చెత్త సేకరణ నిలిచిపోవడంతో గుమ్మాల్లోనే చెత్త కుప్పలు పేరుకుపోతున్నాయి. మరోపక్క సైడు కాలువల్లో పూడిక తీయక పోవడంతో మురుగునీరు రోడ్లపైనే ప్రవహిస్తోంది. సిల్టు తీయకపోవడంతో కాలువల్లో నీరు ఒక్క అడుగు కూడా ముందుకు కదలటం లేదు. దీంతో ఏ వీధిలో చూసినా ఈగలు, దోమలు విపరీతంగా పెరిగిపోయాయి. రాత్రి, పగలు తేడా లేకుండా దోమలు ప్రజల రక్తన్ని పీల్చేస్తున్నాయి. చీకటి పడితే కంటిపై కునుకు లేకుండా దోమలు చెండుకు తింటున్నాయి. నగరంలో ఇంత ప్రమాదకర పరిస్థితులు నెల కొన్నా పాలకులకు చీమకుట్టినట్టైనా లేదు. ఇవేమీ పట్టని అధికార పక్షం కార్మిక సంఘాల పైనా, ప్రతిపక్షాలపైన నెపం వేయడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పాతబస్తీలో చిన్నారికి డెంగీ...

పారిశుధ్య నిర్వహణలేని కారణంగా వ్యాపార కూడలి అయిన పాతబస్తీలో విష జ్వరాలు విజృంభిస్తున్నాయి. దీంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. నిత్యం జనంతో కిటకిటలాడే వన్‌టౌన్‌లో ఏ వీధిలో చూసినా చెత్త కుప్పలు పేరుకుపోయాయి. వ్యాపార కూడలి కావడంతో ఇతర ప్రాంతాల కంటే పాతబస్తీలో చెత్త ఎక్కువగా ఉత్పత్తి అవుతుంది. ఒక్క రోజు చెత్త సేకరణ నిలిచిపోతే కంపుకొట్టే పాతబస్తీలో ఐదు రోజులుగా ప్రజలు కంపులోనే జీవిస్తున్నారు. దోమలు విపరీతంగా పెరిగి అంటురోగాల బారిన పడుతున్నారు. వన్‌టౌన్ కొత్తపేట, రావిచెట్టు ప్రాంతానికి చెందిన ఓనిరుపేద కుటుంబానికి చెందిన మూడేళ్ల బాలుడు అఖిలేష్‌కు మలేరియా, కామెర్లు రావడంతో బోసుబొమ్మ సెంటర్‌లోని ఓ చిన్నపిల్లల ప్రైవేటు ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అక్కడ వైద్యులు డెంగీ జ్వరంగా నిర్ధారించి పెద్దాసుపత్రికి తీసుకువెళ్లమని చెప్పినట్లు బాలుడి తల్లిదండ్రులు తెలిపారు. ఇళ్లల్లో పాచిపని చేసి జీవించే ఆ కుటుంబానికి ముగ్గురు పిల్లలు కాగా రెండేళ్ల క్రితం పెద్ద కుమారుడు కూడా విషజ్వరం బారినపడి మృతి చెందినట్లు స్థానికులు చెబుతున్నారు. తాజాగా రెండవ కుమారుడు కూడా విషజ్వరం బారిన పడడంతో ఆ కుటుంబం తీవ్ర భయందోళనకు గురవుతోంది. నగరంలో ఏ పేటలో చూసినా ఏదో ఒక

- మిగతా 3 లో

'కత్తెర'కు కట్ !

రాజధాని డెస్క్ : ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ప్రధాన పార్టీల్లో మార్పులు, చేర్పులు అంతే వేగంగా చోటు చేసుకుంటున్నాయి. ముఖ్యంగా వచ్చే ఎన్నికల్లో విజయం సాధించి అధికార పగ్గాలు చేపట్టాలని కృత నిశ్చయంతో ఉన్న వైసీపీలో మార్పులు భారీ ఎత్తున చోటు చేసుకుంటున్నాయి. కీలకమైన రాజధాని గుంటూరు జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో ఇప్పటి వరకు గడిచిన నాలుగేళ్లుగా సమన్వయకర్తలుగా ఉన్న వారిని పక్కకు పెట్టి కొత్తవారికి ఇక్కడ అవకాశం ఇస్తున్నారు. ఈ క్రమంలో ఇప్పటికే చిలకలూరిపేట, గుంటూరు పశ్చిమ నియోజకవర్గాల్లో మార్పులు చేసిన జగన్.. ఇప్పుడు మరో నియోజకవర్గంలోనూ మార్పులకు శ్రీకారం చుట్టారు.

వైసీపీలో సంచలనం డాక్టర్ శ్రీదేవి ఎవరు...!

జిల్లాలోని ఎస్సీ నియోజకవర్గాల్లో కీలకమైన తాడికొండలో వైసీపీ సమన్వయకర్తను మారుస్తున్నారనే వార్తలు జోరందు కున్నాయి. వాస్తవానికి గత ఎన్నికల్లో తాడికొండ నుంచి పోటీ చేసి ఓడిపోయిన కత్తెర హెన్రీ క్రిస్టియానా ఇక్కడ ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. అయితే, వచ్చే ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిని ఢీ కొట్టి గెలిచే పరిస్థితిలో లేరని జగన్‌కు పలు నివేదికలు అందాయట. తాడికొండ నియోజకవర్గం ఏపీ రాజధాని కేంద్రం కావడంతో ఈ ప్రాంతంలో రాజధాని ఏర్పాటు వల్ల టీడీపీకి సానుభూతి పరులు ఎక్కువ అయ్యారని... ఇక్కడ నుంచి సాధారణ వ్యక్తిని పోటీలో దింపితే గెలుపు అంత సులువు కాదని వైసీపీ అధిష్టానం భావిస్తోంది.

ఈ క్రమంలోనే పలు నివేదికలు తర్వాత ఇక్కడ ఆర్థికంగా, ఇతరత్రా సామాజిక సమీకరణల్లో మరో బలమైన అభ్యర్థిని దింపాలని జగన్ నిర్ణయించినట్టు సమాచారం. ఈ క్రమంలోనే డాక్టర్ శ్రీదేవి పేరు తెరమీదికి వచ్చింది. ఆమెను నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా నియమించబోతున్నట్టు వైసీపీలో ప్రచారం జరుగుతోంది. దీనిపై రెండు రోజుల్లోనే ఉత్తర్వులు రావొచ్చని తెలుస్తోంది. అయితే, డాక్టర్ శ్రీదేవి తాడికొండ నియోజకవర్గానికే కాకుండా గుంటూరు జిల్లాకు కూడా కొత్తకావడంతో ఆమె ఎవరు? అనే ప్రశ్న ఇప్పుడు జిల్లా రాజకీయాల్లో హల్‌చల్ చేస్తోంది. డాక్టర్ శ్రీదేవి హైదరాబాద్‌లో మెహిదీపట్నంలో డాక్టర్‌గా పని చేస్తున్నట్టు సమాచారం. వాస్తవానికి మాదిగ సామాజికవర్గానికి చెందిన శ్రీదేవి తాడికొండ మండలానికి చెందినవారే.

ఆమె భర్త రెడ్డి సామాజికవర్గానికి చెందిన వారు కావడం, ఆయన వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మేనమామ రవింద్రనాథ్ రెడ్డికి బంధువు కావడంతో వారి ద్వారానే శ్రీదేవి జగన్‌ను కలిసినట్టు తెలిసింది. ఇక శ్రీదేవికి గుంటూరులోని లలితా హాస్పటల్స్ యాజమాన్యం నుంచి కూడా సపోర్ట్ ఉన్నట్టు సమాచారం. ఇటు సామాజిక సమీకరణల పరంగా రెండు కులాల ఈక్వేషన్లతో పాటు అటు ఆర్థికంగా శ్రీదేవి బలవంతురాలు అని నిర్ణయానికి వచ్చిన జగన్ ఆమె అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసినట్టు తెలిసింది. శ్రీదేవి తాడికొండలో పాత వైసీపీ క్యేడర్‌ను కలుపుకుని ముందుకు వెళ్తే ఇక్కడ వచ్చే ఎన్నికల్లో వైసీపీ, టీడీపీ మధ్య హోరాహోరి పోరు ఖాయమని అంటున్నారు పరిశీలకులు. మరి జగన్ ఈక్వేషన్ ఇక్కడ ఏమేరకు పనిచేస్తుందో చూడాలి. ఇక్కడ టీడీపీ సిట్టింగ్ తెనాలి శ్రావణ్‌కుమార్‌కు టికెట్ ఇచ్చే పరిస్థితి లేదని అంటున్నారు. ఈ పరిస్థితుల్లో ఏం జరుగుతుందో చూడాలి.

తుపాను బాధితులకు

బాసటగా ఉంటాం

జనసేన కేంద్ర నూతన కార్యాలయంలో పూజలు చేస్తున్న పవన్ కళ్యాణ్

జనసేన కేంద్ర కార్యాలయం ప్రారంభం

రాజధాని ప్రతినిధి, విజయవాడ: శ్రీకాకుళం జిల్లాలో తిత్లీ తుపాను విధ్వంసం తీవ్ర నష్టాన్ని మిగిల్చిందని, తుపాను బాధితులకు జనసేన పార్టీ అండగా ఉంటుందని ఆ పార్టీ అధినేత పవన్ కల్యాణ్ తెలిపారు. విజయవాడలో జనసేన పార్టీ కేంద్ర కార్యాలయాన్ని మాజీ స్పీకర్ నాదెండ్ల మనోహర్‌తో కలిసి ప్రారంభించిన అనంతరం మీడియా సమావేశంలో మాట్లాడారు. జనసేన సైనికులు తుపాను ప్రభావిత ప్రాంతాల్లో సేవాకార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారని తెలిపారు. పార్టీలో కొత్తగా చేరిన నాదెండ్ల మనోహర్‌తో కలిసి సాయంత్రం తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించనున్నట్లు చెప్పారు.

విజయవాడలో జనసేన కేంద్ర పార్టీ కార్యాలయం ఏర్పాటు చేసుకోవటం శుభపరిణామమని నాదెండ్ల మనోహర్ అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ఎటువంటి పరిస్థితులనైనా ఎదుర్కొనే మనస్తత్వం ఉన్న పవన్‌తో కలిసి పనిచేయాలనే తాను జనసేనలోకి చేరినట్లు వివరించారు. ఈ క్రమంలో దీరకాల పోరాటాలకు సైతం సిద్ధంగా

- మిగతా 3 లో

వేల కోట్లకు పడగలెత్తిన రిత్విక్ కన్‌స్ట్రక్షన్స్

- రాజ్యసభ సభ్యుడు సీఎం రమేష్ ఇంట్లో ఐటీ సోదాలు
- సమీప బంధువులు అనుచరుల ఇళ్లల్లోనూ తనిఖీలు
- పోట్లదుర్తి చేరుకున్న టీడీపీ నేతలు
- కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసనలు

కడప : టీడీపీ నేత రాజ్యసభ సభ్యులు ఎంపీ సీఎం రమేష్ నివాసం గ్రహం, సమీప బంధువులు, ప్రధాన అనుచరుల ఇళ్లల్లో శుక్రవారం ఐటీ అధికారులు సోదాలు చేశారు. ఈవార్త జిల్లాలో దావానంలా వ్యాపించింది. విషయం తెలుసుకున్న టీడీపీ శ్రేణుల్లో కలకలం రేగింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆదాయపు పన్నుశాఖ అధికారులు సోదాలు చేసి మూడు సూటకేసులల్లో విలువైన పత్రాలు, డ్యాకుమెంట్లు తీసుకెళ్లారు. ఎర్రగుంట్ల మండలం పోట్లదుర్తి గ్రామంలో రాజ్యసభ సభ్యులు సీఎం రమేష్ ఇంటిలో శుక్రవారం తిరుపతి నుంచి వచ్చిన 8 మంది ఐటీ (ఇన్‌కం ట్యాక్స్) అధికారులు తనిఖీలు చేశారు.

ఐటీ అధికారుల తనిఖీలు చేయడాన్ని రాజకీయ రంగు పులిమి నిరసనలు, నినాదాలు చేపట్టారు. ఓవైపు అధికారులు వారి పని వారుచేస్తుండగా మరోవైపు టీడీపీ శ్రేణులు ఆం దోళనలు కొనసాగించాయి. ఎమ్మెల్సీలు రామసుబ్బారెడ్డి, బీటెక్ రవీ, మాజీ ఎమ్మెల్యే వీరశివారెడ్డి, రెడ్యం వెంకటసుబ్బారెడ్డి తదితరులు పోట్లదుర్తి చేరుకొని హంగామా సృష్టించారు. నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన పాటించారు. ప్రధాని నరేంద్రమోదీకి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ మీడియా ఎదుట ఆగ్రహం ప్రదర్శించారు.

రిత్విక్ కన్‌స్ట్రక్షన్స్....

రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎంపీ రమేష్‌నాయుడు చెందిన రిత్విక్ కన్‌స్ట్రక్షన్‌కు వేల కోట్లు కాంట్రాక్టు పనులు వచ్చి చేరిపోయాయి. అప్పటి వరకు

- మిగతా 2 లో

తిత్లీ బీభత్సంపై ప్రధానికి చంద్రబాబు లేఖ

తక్షణ సాయం రూ.1200 కోట్లకు వినతి



రాజధాని ప్రతినిధి, అమరావతి : తిత్లీ తుపాను బీభత్సంపై ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రధాని నరేంద్రమోడీకి లేఖ రాశారు. ప్రాథమిక అంచనా

- మిగతా 3 లో

నేటి లోకం



మేం అపరాధ రుసుము కడతాం కానీ,
మా సొంత బైకుల్లో పెట్రోలు మాత్రం కొట్టించుకోము

మేరీమాత డిస్పెన్సరీ హెల్త్ క్యాంపులు

గతేడాది ఏర్పాటు చేసిన వైద్యశిభిరంలో వృద్ధులను పరీక్షిస్తున్న వైద్యులు (ఫైల్)

రాజధాని ప్రతినిధి, తుళ్లూరు : ఏటా నిర్వహించే మేరీమాత డిస్పెన్సరీ వైద్య శిబిరాలు ఈనెల 16 నుంచి ప్రారంభిస్తామని మేరీమాత డిస్పెన్సరీ వర్గాలు తెలిపాయి. ప్రతి ఏడాది ఇటలీ నుంచి ప్రత్యేక వైద్యులు వచ్చి గ్రామీణ ప్రాంతాల్లోని పిల్లలు, మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించి వారికి ఉచితంగా మందులు సమకూర్చడంతో పాటు, పేదలకు బట్టలతో పాటు, పిల్లలను ఆకర్షించడానికి అక్కడి నుంచి అందమైన బొమ్మలను కూడా పంచుతుంటారు. అనేక ఏళ్లుగా రాజధాని ప్రాంతంలో ఆరోగ్యం కోసం కృషి చేస్తున్న మేరిమాత ఆసుపత్రి 16న డిస్పెన్సరీలోనే క్యాంపును నిర్వహిస్తుందని తెలియ చేశారు. 17న వైకుంఠపురం, 18న, నేలపాడు, 19న రాయపూడి, 20న అబ్బరాజు పాలెం, 22న దొండపాడుల్లో ఈ క్యాంపులను నిర్వహిస్తున్నామని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని స్థానికుల కు వారు విజ్ఞప్తి చేశారు. విదేశీ డాక్టర్లు జార్జి, రాబర్ట్‌ల బృందంతోపాటు స్థానిక డాక్టర్. సిస్టర్ సోలి, అంతకు ముందు ఇక్కడ తన సేవలను అందించిన డాక్టర్. సిస్టర్ జైన్‌లు కూడా ఈ శిబిరాల్లో వైద్య సాయం అందించనున్నారని, ఆసుపత్రి వర్గాలు వెల్లడించాయి.



ఏపీ సచివాలయం 3వ భవనంలో ఏర్పాటు చేసిన అరకు వ్యాలీ కాఫీ స్టాల్

రాజధాని వార్తలు కథనం

జీవన్మరణ సమస్య

ఎంతో మేధావిని అనుకునే మనిషి చేసే వికృత చర్యలకు ప్రకృతి సర్వనాశనం అయిపోయింది. కాంక్రీట్ జంగిల్‌ను రూపొందించి ఎంతో ప్రగతి సాధించాననుకునే మనిషికి భూతాపం సవాలు విసిరింది. 1.5 డిగ్రీల సెల్సియస్ కంటె ఒక్క డిగ్రీ ఉష్ణోగ్రత పెరిగిన భూమిపై జీవరాసులన్నీ ఆకస్మిక మరణానికి లోనవుతాయి. భూతాపంతో కలిగే దుష్పరిణామాలు, పంటల దిగుబడి,ఆర్థిక నష్టంపై యేల్ యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్ విలియం డీ నోర్డాన్, న్యూయార్క్ యూనివర్సిటీ అనుబంధ స్టెర్న్ బిజినెస్ స్కూల్‌కు చెందిన ప్రొఫెసర్ పౌల్ ఎం రోమర్‌ల పరిశోధనకు ఈ ఏడాది అత్యున్నత అవార్డు నోబెల్ ప్రకటించారంటే ఈ విషయం ఎంత తీవ్రమైనదో గుర్తించాలి. ప్రజలకు ప్రస్తుతం కావాల్సింది మహా పట్టణాలు కాదు.. పచ్చటి మొక్కలు, చెట్లు చేమలు. అయితే ప్రభుత్వాలు ప్రజలకు మాయమాటలు చెబుతూ అడవులను, పొలాలను ధ్వంసం చేస్తున్నాయి. వారి కల్లబొల్లి కబుర్లను నమ్మి ప్రజలు చేష్టలుడిగి చూస్తూ ఉండిపోయారు. 100 ఏళ్లల్లో అభివృద్ధి పేరిట, కరెన్సీ నోట్ల కోసం అత్యంత దురాశాపరులు చేసిన ప్రకృతి హననం భూగోళంపై సమస్త జీవరాశిని మృత్యుముఖంలోకి నెట్టాయి. భూగోళంలో ఒక వైపు తీవ్ర జల ప్రళయాలు పంటలను,జనావాసాలను తుడిచిపెట్టుకు పోతుండగా, మరోపక్క గుక్కెడు నీళ్లు కూడా లేకుండా ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. మరో 12 ఏళ్లలో ప్రస్తుత భూతాపం మరో సెంటిగ్రేడ్ ఉష్ణోగ్రత పెరుగుతుంది. దీంతో పరిస్థితి మరింత తీవ్ర రూపం దాల్చి భూమిపై ఉన్న సగం జీవరాశి, మొక్కలు అంతరిస్తాయి. భూతాపం పెరిగితే ధ్రువాల్లో మంచు కరిగే వేగం మరింత పెరుగుతుంది. ఇప్పుడు మనం భూమ్మీద వేసవిలో చూస్తున్న వేడిమి ఒక మోస్తరుది మాత్రమే.. అప్పుడు పూర్తిగా మంటల్లో ఉన్నట్లుంటుందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు.

దక్షిణ కొరియాలో వారం పాటు శాస్త్రవేత్తలు, అధికారుల మధ్య సమగ్ర చర్చ తరువాత 'ఇంటర్ గవర్నమెంటల్ ప్యానెల్ ఆన్ క్లైమేట్ చేంజ్' (ఐపీసీసీ) భూఉష్ణోగ్రతలు 1.5 డిగ్రీల సెంటీగ్రేడ్ మేర పెరిగితే ఆ ప్రభావం ఎలా ఉంటుందన్న అంశంపై పై నివేదిక విడుదల చేశారు.కార్పొరేట్ కంపెనీల ద్వారా 57 శాతం,పరిశ్రమల నుంచి 17శాతం,అడవుల నరికి వేత ద్వారా 8శాతం, ఇతరత్ర విధానాల ద్వారా 4శాతం కర్బన ఉద్గారాలు వెలువడుతున్నాయి. రెండు దశాబ్దాల పాటు ప్రపంచ జీడీపీలో 2.5 శాతం ఖర్చు చేయాలని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

1.5 డిగ్రీల సెంటీగ్రేడ్‌ల ఉష్ణోగ్రతలు తగ్గించడానికి బొగ్గువినియోగాన్ని పూర్తిగా ఆపేయాలని, ప్రపంచవ్యాప్తంగా 70 మిలియన్ చదరపు అడుగుల విస్తీర్ణం (ఆస్ట్రేలియా ఖండంతో సమానం)లో ఇంధన పంటలు (జీవ ఇంధనానికి వాడే పంటలు) సాగుచేయాలని, 2030 నాటికి ప్రపంచవ్యాప్తంగా కర్బన ఉద్గారాలు 2010 నాటి స్థాయితో పోల్చితే 45 శాతం తగ్గించే విధంగా 2050 నాటికి ప్రపంచ విద్యుత్ అవసరాలలో 85 శాతం పునరుత్పాదక ఇంధన వనరులే తీర్చాలని ఐపీసీసీ లక్ష్యంగా పెట్టుకుంది. 1.5 డిగ్రీల భూతాపాన్ని తగ్గించాలంటే ఒక్క ఇంధన రంగంలోనే ప్రపంచవ్యాప్తంగా 2018 నుంచి 2035 మధ్య కాలంలో ఏటా 2 కోట్ల 40 లక్షల డాలర్ల మేర వెచ్చించాల్సి ఉంటుంది. భూతాపాన్ని తగ్గించడానికి ఏమాత్రం గడువు లేదు. వెంటనే స్పందించాల్సిందే. కానీ, ఇప్పుడిది ప్రభుత్వాధినేతలు, రాజకీయ నేతల చేతుల్లో ఉంది.

టోల్ చెల్లించనవసరం లేదు

టోల్ గేట్ నుంచి 200 మీటర్ల వరకు ట్రాఫిక్ జామ్ అయినా, టోల్ గేట్ నుంచి కొద్ది దూరంలోని ఎల్లో లైన్ అవతల ఎవరైనా 5 నిముషాల కంటే ఎక్కువ సమయం వేచి ఉండాల్సి వచ్చినా టోల్ కట్టాల్సిన అవసరం లేదు. దీనిపై సంబంధిత మంత్రిత్వశాఖ ఎప్పుడో ఆదేశాలు జారీ చేసింది. అయితే ఈ విషయం అందరికీ తెలియదు.

సెక్రటేరియట్ ముందు నమాజ్ చేసిన వ్యక్తి అరెస్టు

లక్నో : ఉత్తర్ ప్రదేశ్ సెక్రటేరియట్ ముందు శుక్రవారం సాయంత్రం కాస్త గందరగోళ వాతావరణం నెలకొంది. ఓ వ్యక్తి తన నడుముకు కత్తిని కట్టుకుని ప్రధాని నరేంద్ర మోడీకి వ్యతిరేకంగా నినాదాలు చేశాడు. అంతకుముందు సెక్రటేరియట్ ఎదురుగా నమాజ్ చేశాడు. దీంతో కాసేపు భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. ఈ ఘటన జరిగిన సమయంలో యూపీ సీఎం యోగీ ఆదిత్యనాథ్ ప్రభుత్వ ఉన్నతాధికారులతో సెక్రటేరియట్‌లో సమీక్ష జరుపుతున్నారు. గందరగోళ పరిస్థితికి కారణమైన మనిషిని రఫీక్ అహ్మద్‌గా పోలీసులు గుర్తించారు.

రెండు ఏటీఎంలను బద్దలుగొట్టి రూ.35 లక్షలు దోచుకెళ్లారు

తిరువనంతపురం : కేరళలో దోపిడి దొంగలు రెచ్చిపోయారు. రెండు ఏటీఎంలను బద్దలుగొట్టి రూ.35 లక్షల సొత్తు దోచుకుని వెళ్లారు. శుక్రవారం తెల్లవారు జామున త్రిస్సూర్, ఎర్నాకుళం జిల్లాల్లో ఈ వరుస చోరీలు చోటుచేసుకున్నాయి. తొలుత ఎర్నాకుళం జిల్లా త్రిప్పునిత్తురలో ఇరుంబనం వద్దనున్న ఓ జాతీయ బ్యాంకు ఏటీఎంను దొంగలు పగలగొట్టారు. గ్యాస్ కట్టర్ల ద్వారా ఏటీఎంను పగలగొట్టి రూ.25 లక్షలతో పరారయ్యారు. కాగా త్రిస్సూర్ జిల్లా కోరట్టిలోని ఓ ప్రయివేటు బ్యాంకు ఏటీఎంను పగలగొట్టి రూ.10 లక్షలు దోచుకెళ్లారు.

వేల కోట్లకు పడగలెత్తిన రిత్విక్ కన్‌స్ట్రక్షన్స్

(మొదటిపేజీ తరువాయి)

అరకొర పనులకే పరిమితమైన ఆ సంస్థ రాష్ట్రంలో దాదాపుగా రూ.3,658కోట్లు పనులు చేసినట్లు సమాచారం. సాగునీటి ప్రాజెక్టుల్లో పెండింగ్‌లో ఉన్న పనులు కల్పతరువుగా నిలిచాయి. జీఎన్ఎస్ఎస్, హెచ్ఎన్ఎస్ఎస్, ఆర్టీపీపీ, వంశధార, కుప్పం బ్రాంచ్ కెనాల్, వెలిగొండ టన్నెల్ ప్రధానంగా ఉన్నట్లు సమాచారం. ఇదివరకే టీడీపీ నేత ప్రొద్దుటూరు మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి సైతం ప్రజాధనాన్ని దోపిడీ చేస్తున్నట్లు ఆరోపణలు సైతం చేశారు. ఈనేపథ్యంలో ఐటీ విభాగం ప్రత్యక్ష తనిఖీలు చేయడంపై పోట్లదుర్తి వాసులు 'తేలు కుట్టిన దొంగల్లా' వ్యవహరిస్తున్నారని పలువురు బాహాటంగా అంటున్నారు.

సీఎం రమేశ్ ఇంట్లో ముగిసిన ఐటీ సోదాలు

సీఎం రమేశ్ ఇంట్లో ఐటీ అధికారుల సోదాలు ముగిశాయి. ఎర్రగుంట్ల మండలం పోట్లదుర్తిలోని రమేశ్ నివాసంలో 10 గంటలపాటు ఆదాయపన్ను శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. సీఎం రమేశ్ సోదరుడు సురేశ్ సమక్షంలో ఇవి కొనసాగాయి. తిరుపతి, ప్రొద్దుటూరుకు చెందిన 12 మంది ఐటీ అధికారులు సోదాలు జరిపారు. ఆస్తులకు సంబంధించి ఐటీ రిటర్న్ దాఖలుపై అధికారులు విచారించారు. అధికారులు తమ వద్ద నుంచి ఎలాంటి పత్రాలను స్వాధీనం చేసుకోలేదని సీఎం రమేశ్ సోదరుడు సురేశ్ తెలిపారు. తాము నిజాయతీగా ఉన్నాం కాబట్టే 10 గంటల పాటు సోదాలు చేసినా ఎలాంటి ఆధారాలు లభించలేదని ఆయన అన్నారు.

ఈ ఏడాది నోబెల్ పురస్కారాలు

మానవాళి మహోన్నత అభ్యున్నతికోసం వివిధ రంగాల్లో అహరహం కృషి చేసిన వారికి గుర్తింపుగా ఏటా అక్టోబర్‌లో అత్యున్నత నోబెల్ పురస్కారాలు అందిస్తారు. ఈ ఏడాది మొత్తం 12 మందికి నోబెల్ పురస్కారాలు దక్కాయి.

వైద్యశాస్త్రంలో అమెరికా,జపాన్‌కు చెందిన ఇద్దరు శాస్త్రజ్ఞులకు, భౌతిక శాస్త్ర నోబెల్ బహుమతి పొందినవారిలో అమెరికా శాస్త్రజ్ఞుడు ఆర్థర్ ఆష్కిన్ (96), ఫ్రాన్స్‌కు చెందిన జెరార్డ్ మోరో (74), కెనడా శాస్త్రజ్ఞురాలు డొనా స్ట్రిక్‌లాండ్ (59)లు ఉన్నారు.ఈ బహుమతి అందుకున్న మూడో మహిళ, 55 ఏళ్ల తర్వాత అందుకున్నది డొనా స్ట్రిక్‌లాండ్ కావడం విశేషం. అమెరికాకు చెందిన శాస్త్రవేత్త ఫ్రాన్సెస్ హెచ్ ఆర్నాల్డ్, పరిశోధకులు జార్జ్ పి. స్మిత్, బ్రిటన్‌కు చెందిన పరిశోధకులు సర్ గ్రెగొరీ పి. వింటర్ ఈ ఏడాది రసాయినిక నోబెల్ పురస్కారానికి ఎంపికయ్యారు. ప్రతిష్టాత్మక నోబెల్ శాంతి బహుమతి ఈ ఏడాది ఇద్దరిని వరించింది. డెనిస్ ముక్‌వెగె, నదియా మురాద్‌కు సంయుక్తంగా ఈ బహుమతి దక్కింది. లైంగిక హింసను అరికట్టేందుకు చేసిన కృషికి, లైంగిక దాడి బాధితులకు చేసిన సహాయానికిగాను నోబెల్ శాంతి బహుమతి వారిని వరించింది. అర్థశాస్త్రంలో స్థూల ఆర్థిక శాస్త్రవేత్తలకు నోబెల్ బహుమతిని ప్రకటించింది. విలియమ్ డీ నోర్డాస్, పాల్ ఎం రోమర్‌ను ఈ ఏడాది సంయుక్తంగా ఎకనామిక్స్ నోబెల్ బహుమతిని అందుకుంటున్నారు.

కేన్సర్ కణాల పరిశోధనకు వైద్యనోబెల్

జేమ్స్ పి అల్లిసన్ తసుకు హోంజో

జేమ్స్ పి అల్లిసన్ (అమెరికా), తసుకు హోంజో (జపాన్)కు వైద్యరంగంలో క్యాన్సర్ చికిత్స కోసం పరిశోధన లకుగానూ నోబెల్ బహుమతి లభించింది. క్యాన్సర్ కణాలపై పోరాడేందుకు శరీరంలోని రోగ నిరోధక వ్యవస్థ సాయపడుతుందని వీరు తమ అధ్యయనాల ద్వారా కనుగొన్నారు. పురస్కారంతో పాటు 9 మిలియన్ల స్వీడిష్ క్రోనర్ల (7,80,000 పౌండ్లు) నగదు బహుమతిని వారు అందుకోనున్నారు. క్యోటో విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ హోంజో, టెక్సాస్ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ హోంజో, టెక్సాస్ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ అల్లిసన్‌లు తమ పరిశోధనలకుగాను 2014లో ఆసియా నోబెల్‌గా పేర్కొంటున్న టాంగ్ బహుమతిని అందుకున్నారు. గతేడాది అమెరికా జన్యు శాస్త్రవేత్త జెఫ్రీ హాల్, మైఖేల్ రోస్బాచ్, మైఖేల్ యంగ్‌లు వైద్య శాస్త్రంలో నోబెల్ బహుమతి అందుకున్నారు.

'ఆప్టికల్ లేజర్'కు నోబెల్

55 ఏళ్లలో ఈ అవార్డు గెలిచిన తొలి మహిళా డొనా

ఆర్థర్ ఆష్కిన్ జెరార్డ్ మోరో డొనా

ఆప్టికల్ లేజర్‌లపై కీలక పరిశోధనలు చేసి కంటి శస్త్రచికిత్సల్లో అధునాతన పరికరాలను ఆవిష్కరించిన అమెరికా శాస్త్రజ్ఞుడు ఆర్థర్ ఆష్కిన్ (96), ఫ్రాన్స్‌కు చెందిన జెరార్డ్ మోరో (74), కెనడా శాస్త్రజ్ఞురాలు డొనా స్ట్రిక్‌లాండ్ (59)లను ఈ ఏడాది నోబెల్ భౌతిక శాస్త్ర బహుమతికి ఎంపిక చేసినట్లు రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ ప్రకటించింది. భౌతిక శాస్త్ర నోబెల్‌ను తొలిసారిగా 1901లో ప్రవేశపెట్టగా అప్పటి నుంచి ఈ బహుమతి అందుకున్న మూడో మహిళ, 55 ఏళ్లలో తొలి మహిళ డొనా స్ట్రిక్‌లాండ్ కావడం విశేషం. అలాగే నోబెల్ బహుమతి పొందిన అత్యంత పెద్ద వయస్కుడిగా ఆర్థర్ ఆష్కిన్ నిలవడం మరో విశేషం. 2007లో అమెరికా ఆర్థిక వేత్త లియోనిడ్ హర్విచ్ తనకు 90 ఏళ్ల వయసులో నోబెల్ పొందగా, ఆర్థర్ ఆష్కిన్ 96 ఏళ్ల వయసులో నోబెల్ గెలుచుకుని రికార్డు నమోదు చేశారు. నోబెల్ బహుమతి మొత్తం విలువ 1.01 మిలియన్ డాలర్లు కాగా, ఇందులో సగాన్ని ఆర్థర్ ఆష్కిన్‌కు, మిగిలిన సగాన్ని మళ్లీ రెండు సమభాగాలుగా చేసి జెరార్డ్ మోరో, డొనా స్ట్రిక్‌లాండ్‌లకు ఇవ్వనున్నారు.

సూక్ష్మ క్రిములు, అణువులు, పరమాణువులు, ఇతర జీవించి ఉన్న కణాలను లేజర్ బీమ్‌లను ఉపయోగించి పట్టుకునే ఆప్టికల్ ట్వీజర్ల (పట్టకారు వంటివి)ను తయారుచేసినందుకు ఆర్థర్ ఆష్కిర్‌కు ఈ గౌరవం దక్కింది. ఈ ట్వీజర్ల సాయంతో కాంతి ధార్మిక పీడనాన్ని ఉపయోగించి భౌతిక పదార్థాలను ఆయన కదల్చగలిగారని అకాడమీ తెలిపింది. ఆష్కిన్ 1952 నుంచి 1991 మధ్య కాలంలో అమెరికాలోని ఏటీ అండ్ టీ బెల్ ల్యాబొరేటరీస్‌లో పనిచేస్తున్న కాలంలోనే 1987లో సూక్ష్మజీవులకు హాని చేయకుండానే వాటిని పట్టుకునే ట్వీజర్లను కనుగొన్నారు. ఈ ఆవిష్కరణకు గాను ఆయనకు నోబెల్ ఇస్తున్నట్లు అకాడమీ తెలిపింది. 1991లో పదవీ విరమణ పొందిన ఆష్కిన్, అప్పటి నుంచి తన ఇంట్లోని ప్రయోగశాలలోనే జీవితం గడుపుతున్నారు. మరోవైపు అత్యంత చిన్న ఆప్టికల్ పల్స్‌లను ఉత్పత్తి చేసే విధానాన్ని అభివృద్ధి చేసినందుకు జెరార్డ్ మోరో, డొనా స్ట్రిక్‌లాండ్‌లకు నోబెల్ లభించింది. మోరోకు ఫ్రాన్స్‌లోని ఎకోల్ పాలిటెక్నిక్‌తో పాటు అమెరికాలోని మిషిగన్ విశ్వవిద్యాలయంతో అనుబంధం ఉండగా, డొనా స్ట్రిక్ ల్యాండ్ ఆయన విద్యార్థినే. ప్రస్తుతం ఆమె కెనడాలోని వాటర్లూ విశ్వవిద్యాలయంలో అధ్యాపకురాలిగా పనిచేస్తున్నారు. వీరు ఉత్పత్తి చేసిన ఆప్టికల్ పల్స్ అత్యంత చిన్నవి, సమర్థవంతమైనవని నోబెల్ జ్యూరీ పేర్కొంది.

లైంగిక దాడిపై పోరుకు నోబెల్ శాంతి

కాంగో డాక్టర్, ఇరాక్ హక్కుల కార్యకర్తలకు అవార్డు

డెనిస్ ముక్‌వెగె నదియా మురాద్

ప్రతిష్టాత్మక నోబెల్ శాంతి బహుమతి డెనిస్ ముక్‌వెగె, నదియా మురాద్‌కు సంయుక్తంగా దక్కింది. లైంగిక హింసను అరికట్టేందుకు చేసిన కృషికి, లైంగిక దాడి బాధితులకు చేసిన సహాయానికిగాను నోబెల్ శాంతి బహుమతి వారిని వరించింది. నోబెల్ శాంతి బహుమతి కోసం 331 నామినేషన్లు (216 మంది వ్యక్తులు, 115 సంస్థలు) రాగా ఈ ఇద్దరికి అవార్డు లభించింది. వీరికి 9 మిలియన్ల స్వీడిష్‌ల క్రోనోర్ (1.01మిలియన్ డాలర్లు) బహుమతిగా అందనుంది. డెనిస్ మూక్‌వెగె కాంగోకు చెందిన గైనకాలజిస్టు. తన జీవితాన్ని మొత్తం కాంగోకే లైంగిక హింస బాధితుల కోసం ధారపోశారు. లైంగిక దాడులకు బాధితులైన వేలాది మందిని డెనిస్‌తో పాటు ఆయన టీమ్ ఆదుకున్నది. కాంగోలో అంతర్యుద్ధం జరిగిన సమయంలో ఎన్నో అరాచకాలు చోటుచేసుకున్నాయి. ఆ సమయంలో అనేక మంది లైంగిక వేధింపులకు గురయ్యారు. ఆ బాధితులకు డెనిస్ అండగా నిలిచారు. నదియా మురాద్ ఇరాక్‌కు చెందిన మానవ హక్కుల కార్యకర్త. ఆమె యాజీద్ తెగకు చెందిన యువతి. ఇస్లామిక్ స్టేట్ ఉగ్రవాదుల కారణంగా తనపై జరిగిన లైంగిక హింసను, ఇతర యాజిదీ యువతులు అనుభవిస్తున్న నరకం గురించి ప్రపంచానికి తెలిపారు.

ఇరాక్‌లో తనతో పాటు అనేక మంది మహిళలపై అత్యాచారాలు జరిగాయని ఆమె వివరించారు. అయితే అత్యాచారాలను వ్యతిరేకంగా గళం ఎత్తిన ఆమె.. అనేక మంది బాధితుల తరపున పోరాటం చేశారు. ఇస్లామిక్ స్టేట్‌కు చెందిన ఆర్మీ సుమారు మూడు వేల మంది యాజిద్ తెగ మహిళలపై అత్యంత దారుణంగా లైంగిక దాడులకు దిగింది. తనకు జరిగిన అన్యాయాల గురించి ఆమె 23 ఏళ్ల వయసులోనే ఐక్యరాజ్యసమితి వేదికగా మాట్లాడారు. యువతులపై జరుగుతున్న అకృత్యాలను అరికట్టేందుకు ఆమె పాటుపడ్డారు. యుద్ధాల్లో లైంగిక హింసను ఆయుధంగా ఉపయోగించడాన్ని నిర్మూలించేందుకు డెనిస్, నదియా మురాద్ చేసిన కృషికి నోబెల్ శాంతి బహుమతితో గుర్తింపు లభించింది. అయితే సాహిత్యంలో ఈ ఏడాది నోబెల్ ప్రకటించలేదు.

రసాయన శాస్త్రంలో ముగ్గురికి నోబెల్

జార్జ్ పి. స్మిత్ సర్ గ్రెగొరీ పి. వింటర్ హెచ్ ఆర్నాల్డ్

రసాయన రంగంలో ప్రతిష్ఠాత్మక నోబెల్ పురస్కారం ఈ ఏడాది ముగ్గురిని వరించింది. అమెరికాకు చెందిన శాస్త్రవేత్త ఫ్రాన్సెస్ హెచ్ ఆర్నాల్డ్, పరిశోధకులు జార్జ్ పి. స్మిత్, బ్రిటన్‌కు చెందిన పరిశోధకులు సర్ గ్రెగొరీ పి. వింటర్ ఈ ఏడాది నోబెల్ పురస్కారానికి ఎంపికయ్యారు. ప్రొటీన్లను ఉపయోగించి జీవవైవిధ్య ఇంధనం నుంచి ఔషధాల తయారీ వరకు.. వివిధ రంగాల్లో వినూత్నమైన ఆవిష్కరణలకుగాను వీరికి ఈ అవార్డును ప్రకటించారు. ఈ అవార్డు కింద అందే రూ.7.35 కోట్లలో సగం సొమ్మును ఫ్రాన్సెస్ ఆర్నాల్డ్‌కు, మిగతా మొత్తాన్ని జార్జ్ స్మిత్, గ్రెగోరీ వింటర్‌కు పంచుతున్నట్లు ఎంపిక కమిటీ రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ పేర్కొంది. రసాయన శాస్త్రంలో నోబెల్ అందుకున్న ఐదో మహిళగా ఫ్రాన్సెస్ ఆర్నాల్డ్ ఘనత సాధించారు. అంతకుముందు మరియా స్కోలోడోవోస్కా క్యూరీ (1911), ఇరెనె జోలియట్ క్యూరీ (1935), డొరొతీ క్రోఫూట్ హాడ్‌కిన్ (1964), అడా ఇ.యోనత్ (2009) రసాయన శాస్త్రంలో నోబెల్ అందుకున్నారు.

అర్థశాస్త్రంలో ఇద్దరికి నోబెల్...!

డీ నోర్డాస్ ఎం రోమర్

అర్థశాస్త్రంలో స్థూల ఆర్థిక శాస్త్రవేత్తలైన విలియమ్ డీ నోర్డాస్, పాల్ ఎం రోమర్‌ను ఈ ఏడాది సంయుక్తంగా ఎకనామిక్స్ నోబెల్ వరించింది. గ్రీన్‌హౌజ్ వాయువుల విడుదలకు కారణమైన అన్ని దేశాలపై కార్బన్ ట్యాక్స్‌లను సమంగా విధించే ఓ స్కీమ్‌ను ఆర్థికశాస్త్రవేత్త విలియమ్ నోర్డాస్ అభివృద్ధి చేశారు. గ్రీన్‌హౌజ్ వాయువుల నియంత్రణ కోసం నోర్డాస్ రూపొందించిన పట్టిక ద్వారా వాతావరణ విధానాలను అమలు చేయడంతోపాటు, దేశ ఆర్థిక వ్యవస్థ, వాతావరణ విధానాలను అమలు చేయడం సులువు అవుతుంది. దేశ ఆర్థిక వ్యవస్థ, వాతావరణం మధ్య సంబంధాన్ని తెలియజేసేందుకు నోర్డాస్ క్వాంటిటేటివ్ మోడల్‌ను సృష్టించారు. ఈ మోడల్ ఆధారంగానే ప్రస్తుతం అనేక దేశాల్లో వాతావరణ విధానాలను విశ్లేషిస్తున్నారు. దీని ఆధారంగానే కార్బన్ ట్యాక్స్‌లను కూడా విధిస్తున్నారు. గత 100 ఏళ్లలో మానవుల చర్యల వల్లే ప్రపంచవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయని ఆయన తేల్చారు. మరో శాస్త్రవేత్త రోమర్.. ఎండోజీనస్ గ్రోత్ థియరీని ప్రతిపాదించారు. కొత్త తరహా ఆలోచనలతో... సుదీర్ఘకాల ఆర్థిక ప్రగతి ఎలా సాధ్యమవుతుందన్న సిద్ధాంతాన్ని రోమర్ అభివృద్ధి చేశారు. సంస్థలపై ఆర్థిక శక్తులు చూపే ప్రభావాన్ని అధ్యయనం చేసే విధంగా ఆయన కొన్ని సూత్రాలను తయారు చేశారు. ప్రపంచ ఆర్థికవ్యవస్థలో సుదీర్ఘ సుస్థిర అభివృద్ధి ఎలా సాధ్యమన్న అంశాలను ఇద్దరూ విశ్లేషించారు. ప్రపంచ ప్రజల సంక్షేమం కోసం ఈ ఇద్దరు శాస్త్రవేత్తల రూపొందించిన ఆర్థిక సూత్రాలు ఉపయోగపడుతాయని నోబెల్ కమిటీ వెల్లడించింది.

వైద్యం, భౌతిక, రసాయన, సాహిత్యం, ఆర్థిక రంగాల్లో విశేష కృషి చేసిన వారికి ఏటా నోబెల్ బహుమతి అందిస్తారు. వీటితో పాటు శాంతి బహుమతి కూడా ఇచ్చారు. అయితే కొన్ని లైంగిక ఆరోపణల కారణాల వల్ల ఈ ఏడాది సాహిత్యంలో నోబెల్ ఇవ్వట్లేదు.

– ఖాన్

తిత్లీ బీభత్సం

శ్రీకాకుళంలోనే 2,25,000 కుటుంబాలపై తీవ్ర ప్రభావం

తిత్లీ తుపాను శ్రీకాకుళం జిల్లాను అతలాకుతలం చేసింది. ఆంధ్రప్రదేశ్‌లో అత్యధికంగా 193 కిలోమీటర్ల తీరరేఖ ఉన్న శ్రీకాకుళం జిల్లాలో 18 మండలాలు తిత్లీ ప్రభావానికి విలవిలలాడాయి. విజయనగరం జిల్లాలోనూ తుపాను నష్టం కలిగించింది.తుపాను వర్షాలకు నాగావళి, వంశధార, బాహుదా, మహేంద్రతనయ నదులకు వరద రావడంతో జనజీవనం అల్లకల్లోలమైంది.

తుపాను కారణంగా శ్రీకాకుళం జిల్లాలో ఏడుగురు, విజయనగరం జిల్లాలో ఒకరు మృతిచెందారు. మరో ఇద్దరు మత్స్యకారులు గల్లంతయ్యారు.శ్రీకాకుళం జిల్లాలో 18 మండలాల్లోని 202 గ్రామాల్లో 9,06,125 మంది ప్రజలపై ఇది తీవ్ర ప్రభావం చూపింది. అంటే జిల్లాలో మూడో వంతు ప్రజలు ఈ తుపాను ప్రభావానికి లోనైనట్లు. మొత్తం 2,25,000 కుటుంబాలు తుపాను ప్రభావానికి లోనయ్యాయి. అక్టోబరు 10 నుంచి 12వ తేదీల మధ్య కుంభవృష్టి కురవడంతో నదులు పోటెత్తి వరదలొచ్చి లక్షలాదిమంది నిరాశ్రయులయ్యారు. శ్రీకాకుళం జిల్లాలో మందస, పోలాకి, జలుమూరు మండలాలు వరద ముంపులో ఉన్నాయి. మహేంద్రతనయ నది నుంచి భారీగా వరద వస్తుండడంతో మెళియాపుట్టి, శ్రీనివాసపురం, గోపాలపురం, ముకుందాపురం, పుచ్చపాడు, ఎం.గంగువాడ గ్రామాలు నీటమునిగి ఇళ్లు దెబ్బతిన్నాయి. ఇక్కడి ప్రజలను అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలించారు. రెండు జిల్లాల్లో 8,962 ఇళ్లు దెబ్బతిన్నాయి. శ్రీకాకుళం జిల్లాలో 6 పట్టణాలు, 4,319 గ్రామాలు అంధకారంలో చిక్కుకోగా విజయనగరం జిల్లాలో 6 మండలాల్లోని 358 గ్రామాలు తుపాను కారణంగా చీకట్లో మగ్గాయి.

పంట నష్టాలు..

శ్రీకాకుళం జిల్లాలో మొత్తం 1,39,844 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నాయి. అత్యధికంగా 1,36,531 హెక్టార్లలో వరి పంటను రైతులు నష్టపోయారు. 14,378 హెక్టార్లలో ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి. ఇందులో ఒక్క కొబ్బరి పంటే 12 వేల హెక్టార్లలో తీవ్రంగా నష్టపోయింది. మొత్తం 2,98,750 కొబ్బరి చెట్లు నేలకూలాయి. విజయనగరం జిల్లాలో మొత్తం 308 హెక్టార్లలో వరి, చెరకు, కాటన్, మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నాయి. 2,424 హెక్టార్లలో అరటితోటలు ధ్వంసమయ్యాయి.

మత్స్యకారులకు తీవ్ర నష్టం

తిత్లీ కారణంగా శ్రీకాకుళం జిల్లాలో మత్స్యకారులు రూ.9.35 కోట్ల విలువైన బోట్లు, వలలు వంటి సామగ్రి కోల్పోయారు. విశాఖ జిల్లా మత్స్యకారులకు రూ.1.9 కోట్ల నష్టం వాటిల్లింది. శ్రీకాకుళం జిల్లాలో 80 చెరువులు దెబ్బతిన్నాయి.

సహాయ చర్యలు

శ్రీకాకుళం జిల్లాలో 15 సహాయ శిబిరాలు ఏర్పాటు చేసి బాధితులను ఆదుకున్నారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, అగ్నిమాపక సిబ్బంది కూలిపోయిన చెట్లను తొలగించి రహదారులను రాకపోకలకు అనువుగా మారుస్తున్నాయి.విద్యుత్ శాఖ 148 బృందాలుగా ఏర్పడి విద్యుత్ వ్యవస్థను మళ్లీ గాడిలో పెడుతున్నాయి.

తుపాను సహాయక చర్యల్లో ఒడిశా బెస్టు

1999లో గంటకు 260 కిలోమీటర్ల వేగంతో వీచిన గాలులకు ఊళ్లకు ఊళ్లే తుడిచి పెట్టుకుపోయిన విషాదంతో ఒడిశా గుణపాఠం నేర్చుకుంది.పదివేల మందికి పైగా ప్రాణాలను తీసుకెళ్లిన ఆ తుపాను ఒడిశాను స్మశానంగా మార్చింది. లక్షలాది మందిని నిలువ నీడ లేకుండా చేసింది. అయితే, ఆ విషాదం నుంచి అక్కడి ప్రభుత్వం ఎంతో నేర్చుకుంది. విపత్తులొస్తే ఎలా ఎదుర్కోవాలో తమను చూసి నేర్చుకోవాలన్నంతగా వ్యవస్థలను రూపొందించుకుంది.

20 ఏళ్లలో తుపాన్లను ఎదుర్కోవడానికి పక్కాగా సన్నద్ధమైంది.2013లో వచ్చిన ఫైలిన్ తుపానును ఒడిశా ఎదుర్కొన్న తీరే అందుకు ఉదాహరణ. ఆ సమయంలో గంటకు 260కి.మీ. బలమైన గాలులు గోపాల్‌పూర్ తీరాన్ని తాకాయి. విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. కమ్యూనికేషన్ వ్యవస్థ స్తంభించింది. ఇళ్ల కిటికీల అద్దాలన్నీ టపటపా పగిలిపోయాయి.అంత బలమైన తుపానును కూడా ఒడిశా పకడ్బందీగా ఎదుర్కొంది. ఆస్తి, ప్రాణ నష్టాన్ని చాలా వరకు నివారించింది. 'తిత్లీ' ఆంధ్ర ప్రదేశ్‌తో పాటు ఒడిశాపైనా ప్రభావం చూపింది.ఫైలిన్‌తో పోలిస్తే తిత్లీ తీవ్రత తక్కువే అయినా, అధికారులు ముందుగానే లక్షలాది ప్రజలను సురక్షిత ప్రాంతాలకు పంపించారు. తిత్లీ రాక గురించి తమకు ముందే తెలుసని, అందుకే తుపాను తీరానికి చేరడానికి ముందే ప్రజలను అక్కడి నుంచి తరలించామని ఒడిశా విపత్తు నిర్వహణ శాఖ శాస్త్రవేత్త శోభన్ దస్తిదార్ చెప్పారు.

తుపాను జాగ్రత్త చర్యల కోసం ప్రపంచ బ్యాంకు సహాయాన్ని సైతం తీసుకుంది. ఈ క్రమంలో ఖరగ్‌పూర్ ఐఐటీ సహకారంతో దాదాపు 900 తుపాను సహాయక శిబిరాలను నిర్మించింది.లక్షమందికి పైగా బాధితులకు ఆవాసం కల్పించేందుకు 17వేలకు పైగా ప్రత్యేక కేంద్రాలను నిర్మించారు.తీర ప్రాంతాల్లో 122 సైరన

అటవీ బామ్మ లక్ష్మీకుట్టీ వైద్యం

కేరళలోని కల్లార్ అటవీ ప్రాంతంలో ఓ గిరిజన తెగలో పుట్టిన లక్ష్మీకుట్టీ 75 ఏళ్ల బామ్మ. దాదాపు అయిదు దశాబ్దాలుగా వనమూలికలతో చికిత్స చేస్తున్నారు. పాముకాటుకు వైద్యం చేసి ఎంతో మంది ప్రాణాలు కాపాడారు. భారత ప్రభుత్వం ఆమెను పద్మశ్రీతో సత్కరించింది. 'మేమంతా అడవి తల్లి బిడ్డల మందరం ఒకే తల్లి బిడ్డలం. అడివంతా ఔషధాలే..పళ్లు,కాయలు, వేర్లు, బెరడు, ఆకులు, పువ్వులూ ప్రతీదీ ఔషధమే' అంటారామె..

ఆమె

ఈ అడవే పాఠశాల, ఈ చెట్లు, పుట్టలే నా గురువులు. ప్రతి విషయాన్ని ఇక్కడే నేర్చుకున్నా. ఆ నేర్చుకున్నదాన్నే సమాజానికి పంచుతున్నానంటారు లక్ష్మీకుట్టీ. అడవి చీమ కుట్టిన వాళ్ల నుంచి పాము కాటుకు గురయిన వాళ్ల వరకూ.. అందరూ నా వద్దకు వచ్చి పసర్లు తీసుకెళతారని చెబుతారు. 28 ఏళ్ల వయసు నుంచి ఈ పని చేస్తున్నానని చెప్పే గిరిజన తెగకు చెందిన లక్ష్మీ కుట్టీ 500 వందలకు పైగా మూలికలు, మొక్కలను గుర్తించగలరు.

ఇక్కడి గిరిజన సముదాయంలో బడికి పోయిన తొలి మహిళ కూడా ఈ బామ్మే. 1950లో ఆమె తొలిసారిగా పాఠశాలకు వెళ్లారు .కేరళ ప్రభుత్వం 1995లో ఆమెకు 'నాట్టు వైద్యరత్నం' అనే బిరుదును ప్రదానం చేసింది.

అయిదు వేల ఒక్క రూపాయి నగదు, ధన్వంతరి కాంస్యం విగ్రహంతో పాటు ప్రశంసా పత్రాన్ని ఇచ్చారు.ఇప్పటి వరకు ఆమె పాము కాటు నుంచి ఎందరినో కాపాడారు. భారత ప్రభుత్వం ఆమెను పద్మశ్రీతో సత్కరించింది.బొటానికల్ గార్డెన్, పరిశోధన కేంద్రాలు, శాస్త్రవేత్తలకు... ఔషధ మొక్కలు, మూలికలు ఏరి ఇస్తుంటారామే. వారు ఆహ్వానిస్తే వెళ్లి ప్రసంగాలు కూడా చేస్తారు. అలాగే కొన్ని కళాశాలల్లో బోధిస్తుండటం ఆమె చేస్తుంటారు. ఆమె ప్రధానంగా విషానికి విరుగుడు ఇస్తారు. అందుకే అనేక పురస్కారాలు కూడా పొందానని ఆమె చెబుతుంటారు.భారతదేశం నలుమూలల నుంచీ ప్రజలు ఇక్కడకు వస్తుంటారు.

బామ్మ చికిత్సపై ఎంతో నమ్మకం ఉందని, ఆమె మందులిస్తే తప్పక నయమవుతుందని వారు చెబుతుంటారు. భవిష్యత్ గురించిన చింత లేదని, వచ్చిన వారికి సాయం అందించడమే తనకు తెలుసని చెప్పుతున్న లక్ష్మీ కుట్టి సేవలు అంతర్జాతీయంగా గుర్తింపబడాలని కోరుకుందాం...

కాలమ్

జీవితం విలువైనది

మనిషి జీవితం విచిత్రమైంది
"యవ్వనంలో సమయం, శక్తి రెండూ...ఉంటాయి..
కానీ డబ్బు ఉండదు..
మధ్య వయసులో డబ్బు, శక్తి రెండూ ఉంటాయి.
కానీ సమయం ఉండదు..
వృద్ధాప్యంలో సమయం, డబ్బు రెండూ ఉంటాయి.
కానీ శక్తి మాత్రం ఉండదు..
తెలుసుకునే ప్రయత్నం చేసే లోపు... జీవితం ముగిసిపోతుంది..
మనం పుట్టినప్పుడు మనల్ని ఎవరు వచ్చి చూశారో మనకు తెలియదు..
మనం మరణించాక మనల్ని ఎవరు చూడటానికి వస్తారో కూడా మనకు తెలియదు...
కాబట్టి మనం బ్రతికి ఉన్నప్పుడు మనతో ఉన్నవాళ్లను మనసారా ప్రేమించండి
ఆప్యాయత అనురాగలను పంచండి..
మనం మరణించి కూడా జీవించేలా మానవత్వాన్ని చాటండి.

వైద్యుల నిర్లక్ష్యం వల్లే బాలింత మృతి

ఆర్ఎంవోకు కుటుంబ సభ్యుల ఫిర్యాదు

రాజధాని వార్తలు, రాయపూడి : వైద్యుల నిర్లక్ష్యం వల్లే బాలింత మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు వైద్యాధికారులకు ఫిర్యాదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. తుళ్లూరు మండలం రాయపూడి గ్రామానికి చెందిన కంభంపాటి అరుణ (23), రాజేష్ భార్యా భర్తలకు. అరుణను ప్రసవం నిమిత్తం ఈ నెల 2న సర్వజనాసుపత్రికి తరలించారు. ప్రసూతి విభాగంలో ఆమెకు శస్త్రచికిత్స నిర్వహించగా ఆడ శిశువుకు జన్మనిచ్చింది. పాప ఆరోగ్య పరిస్థితి బాగానే ఉంది. తల్లి ఆరోగ్యం సరిగా లేక పోవడంతో అదే రోజూ ఐసీయూ విభాగానికి తరలించి మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నారు. అప్పటి నుంచి చికిత్స పొందుతున్న ఆమె మృతిచెందింది. అరుణ హఠాత్తు మరణంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. ప్రసవించిన సమయంలో తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉండగా.. రోజుల వ్యవధిలోనే మృతి చెందడంపై వారు జీర్ణించుకోలేకపోయారు. శస్త్రచికిత్స సక్రమంగా చేయలేదని అందుకే ఆమె మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు వాపోయారు. సకాలంలో వైద్యసేవలు అందించలేదని మండిపడ్డారు. ఆమె మృతికి కారకులైన బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆర్ఎంవో ఆదినారాయణకు ఫిర్యాదు చేశారు.

ఇంటింటికి చెత్తసేకరణ ప్రారంభం

రాజధాని వార్తలు, రాయపూడి : రాజధాని గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుపర్చేందుకు ఏపీ సీఆర్డీఏ, గ్రామపంచాయతీలు కృషి చేస్తున్నాయి. ఇందులో భాగంగా ప్రతిగ్రానికి బ్యాటరీతో నడిచే ఆటోలు ఏపీసీఆర్డీఏ ఇటీవల పంపిణీ చేసింది. రాయపూడి గ్రామానికి పంపిణీ చేసిన ఆటోను ప్రారంభించారు. పంచాయతీ కార్యదర్శి వెంకటప్పయ్య మాట్లాడుతూ బ్యాటరీ ఆటోను గ్రామంలో ప్రతిరోజూ తిప్పి చెత్త సేకరిస్తామని చెప్పారు. తడి, పొడి చెత్తను ప్రతి ఇంటి నుంచి సేకరిస్తామని చెప్పారు.

'నారీ శక్తి' పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

హైదరాబాద్ : మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని 'నారీ శక్తి' పురస్కారాలకు తెలంగాణ ప్రభుత్వం దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. మహిళా సాధికారత, సామాజిక సేవతోపాటు వివిధ రంగాల్లో విశేష ప్రతిభ కనబరచిన మహిళలకు ఈ పురస్కారాలను ప్రదానం చేస్తారు. ఈ పురస్కారాలకు దరఖాస్తు చేసుకునే మహిళా అభ్యర్థుల వయసు కనీసం 25 సంవత్సరాలు పైబడి ఉండాలి. సంబంధిత రంగాల్లో కనీసం 5 సంవత్సరాలపాటు పనిచేస్తూ ఉండాలి. గతంలో 'నారీ శక్తి' పురస్కారాలు అందుకున్నవారు మళ్లీ దరఖాస్తు చేసుకోవడానికి అనర్హులు. 'నారీ శక్తి' పురస్కారాలు పొందిన వారికి సర్టిఫికేట్‌తోపాటు లక్ష రూపాయల నగదు అంజేస్తారు. అభ్యర్థులు తమ దరఖాస్తులతోపాటు.. అవసరమైన సపోర్టింగ్ డాక్యుమెంట్లను జతచేసి సంబంధిత చిరునామాలో సమర్పించాలి. దరఖాస్తు, ఇతర వివరాలకు జిల్లా స్త్రీ, శిశు సంక్షేమశాఖ కార్యాలయంలో సంప్రదించవచ్చు.

హైదరాబాద్ వచ్చే ఏడాది అంతర్జాతీయ విత్తన సదస్సు

అమీర్‌పేట : అంతర్జాతీయ విత్తన సదస్సుకు హైదరాబాద్ వేదిక కానుంది. వచ్చే సంవత్సరం జూన్‌లో ఈ సదస్సు జరుగుతుంది. అమీర్‌పేటలో విత్తన సదస్సు (ఐఎస్‌టీఏ కాంగ్రెస్-2019) సన్నాహక కార్యక్రమాన్ని నిర్వహించారు. సీఎస్ ఎస్.కె.జోషి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. సదస్సు నిర్వహణకు ఎంత గానో కృషి చేశారని విత్తన ధ్రువీకరణ సంస్థ సంచాలకులు కె.కేశవులు, వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి సి.పార్థసారథి లను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన సదస్సు గోడ పత్రికలు, వెబ్‌సైట్‌ను ఆవిష్కరించారు. కేశవులు మాట్లాడుతూ... ఈ సదస్సుకు 83 దేశాల నుంచి 1500 మంది ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు.

బాసటగా ఉంటాం

(మొదటిపేజీ తరువాయి)

ఉన్నమని తెలిపారు. ఏపీ రాష్ట్ర అభివృద్ధికి ఎటువంటి త్యాగాలకైనా తాము వెనుకాడబోమని స్పష్టం చేశారు. ఈనెల 15న జరగనున్న జనసేన కవాతులో ప్రతిఒక్క కార్యకర్త, అభిమాని పాల్గొనాలని పిలుపునిచ్చారు. మనోహర్‌తో తనకుపాఠశాల స్థాయి నుంచే పరిచయం ఉందని పవన్ తెలిపారు. జనసేన పార్టీపెట్టిన తర్వాత ఆయన విలువైన సలహాలు, సూచనలు అందిచేవారని తెలిపారు. సరికొత్త రాజకీయ శకం ఏపీకి కావాల్సిన తరుణంలోనే జనసేన ఆవిర్భవించిందని కేవలం 2019 ఎన్నికల్లో గెలిచేందుకు మాత్రం కాదని పవన్ స్పష్టం చేశారు.

శ్మశానవాటికలో ఖననాన్ని వ్యతిరేకించిన స్థానికులు

రాజధాని వార్తలు రాయపూడి : స్థానిక రాయపూడి గ్రామంలో ముస్లిం శ్మశానవాటికలో ఖననం చేయటాన్ని స్థానిక ముస్లింలు వ్యతిరేకించారని షేక్ హజర్ సాహెబ్ తెలిపారు. తన అన్నయ్య యాక్సిడెంట్‌లో చనిపోతే ఖననం చేయదలచిన ప్రదేశంలో వద్దని స్థానికులు వ్యతిరేకించారు. గతంలో తమ తల్లి ఖననాన్ని కూడా ఇలాగే వ్యతిరేకించారని, అడిగితే తమపైకి వచ్చి బెదిరించారన్నారు. గ్రామంలో ఎప్పటినుంచో నివసిస్తున్నామని అయినప్పటికి తమను తక్కువగా చూస్తున్నారని ఆరోపించారు. గ్రామంలో రెండు మసీదులు ఉన్నా యాజమాన్యాలు ఏ మాత్రం పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై గుంటూరు జిల్లా కలెక్టరు ఆఫీసులో ఫిర్యాదు చేశామని హజర్ తెలిపారు. ఈ విషయమై అధికారులు స్పందించి న్యాయం చేయాలని కొరుకుంటున్నానన్నారు.

ల్యాండింగ్ లో పొరపాటు.. అధికారులు పరుగులు



రాజధాని వార్తలు, పలాస : ఉత్తరాంధ్రపై విరుచుకుపడిన తిత్లీ తుఫాను దెబ్బకు అతలాకుతలమైన సిక్కోలు జిల్లాను పరిశీలిం చేందుకు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు హెలికాప్టర్‌లో పర్యటించారు. ఆయన ప్రయాణిస్తున్న హెలికాప్టర్ ల్యాండింగ్ విషయంలో పొరపాటు జరగటంతో అధికారులు ఉరుకులు పరుగులు పెట్టారు. ఉత్తరాంధ్రను అతలాకుతలం చేసిన తిత్లీ తుఫాను తీవ్రతను తెలుసుకునేందుకు హెలికాప్టర్ లో బయలుదేరిన ఏపీ సీఎం చంద్రబాబు శ్రీకాకుళం నుంచి ఇచ్చాపురం.. పలాసలలో పర్యటించారు. అక్కడ ఆయన పలాస ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ల్యాండ్ కావాలి. హెలికాప్టర్ ల్యాండింగ్కు సంబంధించి ఏర్పాట్లు చేశారు. అందరూ చూస్తుండగానే బాబు ప్రయాణిస్తున్న హెలికాప్టర్ వచ్చింది కానీ.. ల్యాండింగ్ మాత్రం ఏర్పాట్లు చేసిన ప్రాంతానికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న డీఎస్పీ కార్యాలయం వద్ద ల్యాండ్ అయ్యింది. దీంతో.. పోలీసులు.. రెవెన్యూ అధికారులు ఉరుకులు పరుగులు దీస్తూ.. హెలికాప్టర్ ల్యాండింగ్ ప్రాంతానికి చేరుకున్నారు. ముందుగా నిర్ణయించిన ప్రాంతంలోకాకుండా డీఎస్పీ కార్యాలయంలోని హెలిప్యాడ్ లో ఎందుకు ల్యాండ్ అయ్యిందన్న విషయంపై ఆరా తీయగా.. ల్యాండింగ్ పాయింట్ పైలట్‌కు కనిపించకపోవటంతో డీఎస్పీ కార్యాలయంలో దించినట్లుగా చెప్పారు. హెలికాప్టర్ ల్యాండ్ అవుతున్న విషయాన్ని గుర్తించిన డీఎస్పీ కార్యాలయ సిబ్బంది ముందస్తు జాగ్రత్తగా ఎంట్రన్స్ గేటును మూసేశారు. అయినా.. ఒక రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రయాణించే హెలికాప్టర్ ను దింపాల్సిన చోటులో కాకుండా వేరే చోట దింపటాన్ని సీరియస్‌గా తీసుకొని అంతర్గత విచారణ చేయించటం మంచిదన్న అభిప్రాయం పలువురి నోట వినిపిస్తోంది.

ఉన్నత శిఖరాలు చేరాలంటే చదువే మార్గం

రాజధాని వార్తలు, రాయపూడి : ఉన్నత శిఖరాలు అధిరోహించాలంటే విద్య ఒక్కటే మార్గమని తుళ్ళూరు మండల పరిషత్తు అధ్యక్షురాలు వడ్లమూడి పద్మలత తెలియపారు. తుళ్ళూరు మండలం రాయపూడిలోని మండలపరిషత్తు ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఆటవస్తువులు పంపిణీ చేశారు. రాయపూడికి చెందిన కాలారి సత్యనారాయణ జన్మదినం పురస్కరించుకోని ఆయన కుమారులు విద్యార్థులకు ఆట వస్తువులు అందజేశారు. ఎంపీపీ పద్మలత మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తునట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు దడిగి సుబ్బారావు, దాతలు కాలారి శ్రీకృష్ణ, కిషోర్, రమేష్, పట్టాభి తదితరులు పాల్గొన్నారు.

ఐక్యరాజ్యసమితిలో భారత్‌కు స్థానం

న్యూఢిల్లీ : ఐక్యరాజ్యసమితిలో భారత్‌కు తగిన గౌరవం దక్కింది. ప్రపంచంలోనే అత్యున్నత మానవ హక్కుల సంస్థ అయిన ఐక్యరాజ్యసమితి (యూఎన్) మానవ హక్కుల సంస్థకు భారత్ ఎన్నికైంది. మానవ హక్కుల మండలి(యూఎన్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్) కోసం జరిగిన ఎన్నికల్లో భారత్ అత్యధిక ఓట్లతో నెగ్గింది. ఆ మండలి సభ్యత్వం కోసం జరిగిన పోల్‌లో భారత్ 188 ఓట్లు సాధించింది. ఆసియా పసిఫిక్ క్యాటగిరీలో భారత్‌కు ఈ గౌరవం దక్కడం విశేషం. మానవ హక్కుల మండలిలో భారత్ మూడేళ్ల సభ్యత్వం దక్కించుకుంది. 2019, జనవరి 1 నుంచి ఈ సభ్యత్వం అమలులోకి వస్తుంది. యూఎన్ జనరల్ అసెంబ్లీలో మొత్తం 193 సభ్య దేశాలు ఉన్నాయి. మానవ హక్కుల మండలిలో 18 మంది కొత్త సభ్యుల కోసం ఎన్నికలు నిర్వహిస్తారు. రహస్య ఓటింగ్ పద్ధతిలో నిర్వహించిన ఎన్నికల్లో 97 ఓట్లు రావాల్సి ఉండగా, మనదేశానికి 188ఓట్లు పోలయ్యాయి. యూఎన్ సాధారణ అసెంబ్లీలో శుక్రవారం 18దేశాలు కొత్తగా ఎన్నికయ్యాయి. ఆసియా పసిఫిక్ ప్రాంతం నుంచి ఐదుదేశాలకు స్థానం ఉండగా మన దేశంతో పాటు బహ్రెయిన్, బంగ్లాదేశ్, ఫిజి, ఫిలిప్పీన్స్ ఎన్నికయ్యాయి. భారత్ విజయం అంతర్జాతీ యంగా మన దేశ ప్రమాణాన్ని సూచిస్తుందని యూఎన్ అంబాసిడర్ సయ్యిద్ అక్బరుద్దీన్ తెలిపారు. మద్దతు తెలిపిన మిత్రదేశాలకు, స్నేహితులకు ధన్యవాదాలు తెలుపుతూ యూఎన్ అంబాసిడర్ ట్వీట్ చేశారు.

తిత్లీ బీభత్సంపై ప్రధానికి చంద్రబాబు లేఖ

(మొదటిపేజీ తరువాయి)

ప్రకారం రూ.2,800 కోట్ల మేర నష్టం జరిగిందని లేఖలో పేర్కొన్నారు. తక్షణ సాయం కింద రూ. 1200 కోట్లు విడుదల చేయాలని కోరారు. తిత్లీ తుపాను కారణంగా విద్యుత్ రంగానికి రూ.500 కోట్లు, రహదారులు, భవనాల శాఖకు రూ. 100 కోట్లు, పంచాయతీ రాజ్ శాఖకు మరో రూ.100 కోట్లు నష్టం వాటిల్లిందని వివరించారు. వ్యవసాయ, ఉద్యాన తోటలకు సంబంధించి రూ.1800 కోట్ల నష్టం వాటిల్లగా పశుసంవర్ధక, మత్స్యశాఖకు రూ.100కోట్ల మేర నష్టం కలిగిందని లేఖలో పేర్కొన్నారు. గ్రామీణ నీటిసరఫరా శాఖకు రూ.100 కోట్లు, జలవనరుల శాఖకు రూ.100 కోట్ల మేర నష్టం వాటిల్లిందని ప్రధాని దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్ర ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన సహాయకచర్యలను వేగవంతం చేసిందని.. కేంద్రం కూడా ముందుకు వచ్చి ఉదారంగా సాయం అందించాలని కోరారు.తిత్లీ తుపానుతో భారీగా నష్టపోయిన శ్రీకాకుళం జిల్లాకు మంత్రులు, తెదేపా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఒక నెల జీతం విరాళంగా ప్రకటించారు. అతలాకుతమైన శ్రీకాకుళం జిల్లాను ఆదుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆ పార్టీ నేత పయ్యావుల కేశవ్ అన్నారు.

ప్రమాదకరంగా పారిశుధ్యం

(మొదటిపేజీ తరువాయి)

జ్వరంతో బాధపడుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. నగరంలోని ఆసుపత్రులు కిటకిటలాడటం ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది.

నిలిచిన ఇంటింట చెత్త సేకరణ

కార్మికుల సమ్మెతో రోజూ నిర్వహించే ఇంటింట చెత్త సేకరణతో పాటు మురుగు కాలువల పూడికతీత నిలిచిపోయింది. దీంతో ఇళ్ల ముందే చెత్త కుప్పలు పెరిగిపోయి దోమల ఉత్పత్తి కారకాలుగా మారాయి. రోజులు తరబడి చెత్త సేకరణ జరగకపోవడంతో కుళ్లిపోయి దుర్గంధం వెదజల్లుతున్నాయి. మరో పక్క సైడు కాలువల్లో పూడికతీత లేకపోవడంతో మురుగు నీరు ఎక్కడికక్కడే నిలిచిపోయింది. కాలువల్లో నీరు ముందుకు పారడంలేదు. దీంతో అనేక చోట్ల మురుగు కాలువల్లోని నీరు రోడ్లపైకి చేరుతోంది. ఫలితంగా ప్రజలకు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.

తీవ్ర వత్తిడిలో అధికారులు, ఉద్యోగులు...

నగర పాలక సంస్థలోని పారిశుధ్య కార్మికులు సమ్మెతో అధికారులు, ఉద్యోగులపై తీవ్ర పని భారం పడింది. నగరంలో నిత్యం వేల సంఖ్యలో కార్మికులు నిర్వహించే విధులు అరకొర ఉద్యోగులతో నిర్వహిస్తున్న పరిస్థితి నెలకొంది. దీంతో అధికారులు, సిబ్బందిపై విపరీత పనిభారం పెరిగి తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. ఏలూరు, బందరు రోడ్లతో పాటు జాతీయ రహదారిలో మినహా ఎక్కడా పారిశుధ్య నిర్వహణ సక్రమంగా జరగడంలేదు. రోజుకు 3,500 మంది కార్మికులు, ఉద్యోగులు చేసే పని ఐదారు వందల మంది నిర్వహించడమంటే వారిపై ఒత్తిడి ఏస్థాయి లో ఉంటుందో అర్థం చేసుకోచ్చు. దీనికితోడు దసరా ఉత్సవాలు కావడంతో పనిభారం మరింత పెరిగిందని పలువురు ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు మేల్కొని కార్మికుల సమస్యలు పరిష్కరించి సమ్మె విరమింపజేయకపోతే పరిస్థితి చేయిదాటిపోయే ప్రమాదం ఏర్పడుతుందని నగరవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రాజధాని క్లాసిఫైడ్స్

నివాస ప్లాట్లు

రాయపూడి
రాజధాని ప్రాంతంలోని రాయపూడి గ్రామ పరిధిలో 500, 1000 గజముల ప్లాట్లు కావలెను
ఫోన్ : 9908244333

నీరుకొండ
రాజధాని ప్రాంతంలోని నీరుకొండ గ్రామ పరిధిలో 500, 1000, 2000 గజముల ప్లాట్లు కావలెను
ఫోన్ : 9440662699

ఇతరములు

ఓంశ్రీ సాయిరాం రిజిస్ట్రేషన్ కన్సల్‌టెన్సీ & సర్వీసెస్ అన్ని రకముల దస్తావేజులు, అగ్రిమెంట్లు వ్రాయబడును. స్టాంపులు అమ్మ బడును. అన్ని రకముల మోటారు వాహనములకు ఇన్సూరెన్స్ కట్టించు కొనబడును.
పాపన చక్రవర్తి డాక్యుమెంట్ రైటర్
ఫోన్ 9502424704, 08645 244992
సబ్ - రిజిస్ట్రార్ ఆఫీస్ ఎదురు, తుళ్లూరు

వెలగపూడి
సాయి గణేష్ ట్రెడర్స్: నిర్మాణ రంగానికిసిమెంట్, స్టీలు, పైపులు, పెయింట్‌లు అమ్మబడును.
ఫోన్ : 9640811333

మందడం
ఎస్.ఆర్.కె. గ్రాండ్ రెస్టారెంట్
ఫోన్ : 9553023388

వెంకటపాలెం
సాయిలాస్య రియల్‌ఎస్టేట్ & ఫైనాన్స్ కన్సెల్టెన్సీ, గాదె నాగేశ్వరరావు
ఫోన్ : 95151 53939

షాప్స్

తుళ్ళూరు
వైభవ్ డ్రస్సెస్
ఫోన్ : 9848407935

హాస్పటల్స్

విజయవాడ
ఆంధ్ర హాస్పటల్,
డా॥శ్రీమన్నారాయణ
ఫోన్ : 9177219900

విజయవాడ
న్యూఫేస్ క్లినిక్ , డా॥మేహబూబ్
ఫోన్ : 9849122788

విజయవాడ
అష్రఫ్ మెటర్నిటీ & ఇ,ఎన్‌టి
డా॥ రెహమాన్
ఫోన్ : 0866-2475087

విశాఖపట్నం
చింతలూరు ఆయుర్వేద
డా॥ విశ్వనాథ్
ఫోన్ :90329 90138

విద్యా సంస్థలు

ఐనవోలు
విఐటీ-ఏపీ యూనివర్శిటీ
ఫోన్ :0863 2370444

నీరుకొండ
ఎస్ఆర్ఎమ్ యూనివర్శిటీ
ఫోన్ :0863 2343000

వాణిజ్య ప్లాట్లు

నవులూరు
రాజధాని ప్రాంతంలోని నవులూరు గ్రామ పరిధిలో 500, 1000, 2000 గజముల ప్లాట్లు కావలెను
ఫోన్ : 9440662699

ఐనవోలు
రాజధాని ప్రాంతంలోని ఐనవోలు గ్రామ పరిధిలో 500, 1000, 2000 గజముల ప్లాట్లు కావలెను
ఫోన్ : 9908244333

నీరుకొండ
రాజధాని ప్రాంతంలోని నీరుకొండ గ్రామ పరిధిలో 500, 1000, 2000 గజముల ప్లాట్లు కావలెను
ఫోన్ : 9440662699

గమనిక : క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటన దారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలు చేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/లేదా అతనిపై చట్టరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.
- మేనేజర్

ప్రకటనలకు సంప్రదించండి 7680994755

ప్రెస్‌ఫొటో అవార్డుల ప్రకటన

నవంబరు 1న ప్రదానోత్సవం

రాజధాని వార్తలు, విజయవాడ : ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి కేంద్రంగా ఫోటో జర్నలిజంలో ఎంతో ప్రతిష్ఠాత్మకమైన ఇండియాప్రెస్ ఫోటో అవార్డులను ప్రకటించారు. 'స్టేట్ ఫొటోజర్నలిస్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ మూడవ జాతీయ స్థాయి ఫొటోగ్రఫి పోటీలు నిర్వహించింది. ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ చేతుల మీదుగా అవార్డులు విడుదల చేశారు. అవార్డులు విడుదల చేశారు. అవార్డుల ఎంపికకు ముంబాయికి చెందిన ఫ్లోర్స్ పత్రిక చీఫ్ ఫొటోగ్రాఫర్ వికాస్ కోల్, ఈనాడు స్కూల్ ఆఫ్ జర్నలిజం ప్రిన్సిపాల్ ఎం. నాగేశ్వర రావు, ఇండియన్ ఎక్స్‌ప్రెస్ చీఫ్ ఫొటోగ్రాఫర్ ఆర్.వి.కోటేశ్వర రావులు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. ఈ ఏడాది ఓవర్ ఆల్ బెస్ట్ ఫొటో అవార్డు కలకత్తాకు చెందిన సంజయ్‌సేన్ గుప్తాను వరించింది. భారతదేశంలో తొలిమహిళా ఫొటో జర్నలిస్ట్, పద్మవిభూషన్ అవార్డు గ్రహీత హోమాయ్ యారవల్లా పేరు మీద తొలిసారిగా ఉమన్ ఫొటో జర్నలిస్ట్ ఆఫ్ ది ఇయర్ అవార్డులతో పాటు మూడు అంశాల్లో మూడు బెస్ట్ ఆఫ్ ది ఇయర్ అవార్డులు ప్రథమ, ద్వితీయ, తృతీయతో పాటు ఏడు ప్రతిభా పురస్కారాలకి ఎంపికయ్యారు. ఈ అవార్డులను "ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మకత, సాంస్కృతిక సమితి అండ్ స్టేట్ ఫొటో జర్నలిస్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్" సంయుక్తంగా ప్రోత్సహిస్తోంది. ప్రతి సంవత్సరం ఈ రంగంలో విశేషంగా కృషి చేసిన వారిని గుర్తిస్తూ జీవన సాఫల్య పురస్కారంతో సత్కరిస్తోంది. ఈ సంవత్సరం సీనియర్ ఫొటోగ్రాఫరైన ఈనాడు దినపత్రికకు చెందిన కేశవులు, సాక్షి దినపత్రిక ఫొటోఎడిటర్ రవికాంతరెడ్డి, ఆంధ్రజ్యోతి దినపత్రిక మాజీ ఎడిటర్ దండమూడి సీతారామ్‌లను లైఫ్‌టైమ్ ఎచీవ్‌మెంట్ అవార్డులకు అసోసియేషన్ ఎంపిక చేసినట్లు కార్యదర్శి డి. ఆనంద్ తెలిపారు. 2018 సంవత్సరానికి ఫొటో కాంటెస్ట్‌కి ప్రముఖ అంతర్జాతీయ ఛాయా చిత్రకారుడు, ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ ఫొటోగ్రఫి అకాడమి ప్రదానకార్యదర్శి టి.శ్రీనివాసరెడ్డి ఛైర్మన్‌గా వ్యవహరించారు.

దసరా ఉత్సవాలు

ఉత్తరభారత దేశం, కోల్‌కతా, దక్షిణ భారత దేశ, మైసూరులో ఘనంగా దసరాను నిర్వహిస్తారు. వీటికి అంతర్జాతీయంగా పేరుప్రఖ్యాతులు, గుర్తింపు ఉన్నాయి. రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ ఈ పండుగను వేడుకగా నిర్వహిస్తారు.

మైసూర్‌లో దసరా ఉత్సవాలు

కోల్‌కతా దుర్గాపూజ

పశ్చిమ బెంగాల్‌లో అత్యంత భక్తి శ్రద్ధల మధ్య జరుపుకునే వేడుక దసరా. బెంగాల్ ప్రజలు ఈ పండుగను దుర్గా పూజ పేరుతో జరుపుకుంటారు. దసరా కు కోల్‌కతా నగరమంతా సినిమా సెట్టింగులను తలపించే పెద్ద పెద్ద పెండాళ్లు (మండపాలు) ఏర్పాటు చేస్తారు. ప్రతి ఒక్క మండపానికి ఒక్కో ప్రత్యేక థీమ్ ఉంటుంది. కొన్ని ప్రాంతాల్లో లక్షలు వెచ్చించి మరీ మండపాలను తీర్చిదిద్దుతారు. అంతేకాదు, 'బొనెది బరీ' పేరుతో కోల్‌కతాలో ఉండే రాజభవనాల్లో అమ్మవారి విగ్రహాలు ఏర్పాటుచేసి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఒడిశాలోని భువనేశ్వర్‌లో కూడా ఇదే తరహాలో వేడుకలు నిర్వహిస్తారు. ఇక్కడ ఏర్పాటు చేసే మండపాల మధ్య పోటీలు కూడా నిర్వహిస్తారు. ఇక్కడ ఏర్పాటుచేసే అమ్మవారి విగ్రహాల్లో జీవకళ ఉట్టిపడుతుంది.

తెలంగాణ బతుకమ్మ

తెలంగాణలో అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించే అందమైన వేడుక దసరా. అమ్మవారిని 'ప్రకృతి స్వరూపిణి'గా భావించి, వివిధ పుష్పాలతో వరసగా అలంకరించి 'బతుకమ్మ'గా ఆరాధిస్తారు. మహాలయ అమావాస్య నుంచి మహర్నవమి వరకు ఈ ఉత్సవం నిర్వహిస్తారు. ఆటపాటలతో సాగే ఈ వేడుక తెలంగాణ సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా నిలుస్తోంది. తొమ్మిది రోజుల పాటు జరిగే బతుకమ్మ ఉత్సవంలో నవ విధ భక్తి మార్గాలు, నవ నిధులకు ప్రతిబింబంగా బతుకమ్మను తొమ్మిది రకాల పుష్పాలతో తొమ్మిది వరసల్లో అమరుస్తారు. తొమ్మిది రోజులూ గౌరీదేవిని.. పూలమ్మగా పుట్టింటికి వచ్చిన తమ ఇంటి ఆడబిడ్డగా బతుకమ్మను ఆరాధిస్తారు.

ఆంధ్రప్రదేశ్ దసరా

దసరా వేడుకల్లో ఆంధ్రప్రదేశ్ విద్యుత్ కాంతులతో దగదగలాడతాయి. అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఇక్కడ ఊరి ఊరికీ ప్రత్యేక ఉత్సవాలు జరుగుతాయి. విజయవాడలోని ఇంద్రకీలాద్రిలో దసరా వేడుకలు అంబరాన్ని తాకుతాయి. నవరాత్రులు పురస్కరించుకుని అమ్మవారు ఒక్కో రోజు ఒక్కో రూపంలో దర్శనమిస్తారు. చివరిరోజు ప్రభలను ఊరేగిస్తారు. ఈ సందర్భంగా నిర్వహించే భేతాళనృత్యం ఆకట్టుకుంటుంది. ఆఖరిరోజున కృష్ణా నదిలో నిర్వహించే తెప్పోత్సం కనువిందు చేస్తుంది. పశ్చిమ గోదావరి జిల్లాలో నిర్వహించే.. ఏనుగుల సంబరాన్ని తప్పకుండా చూడాల్సిందే. కొబ్బరి పీచు, వెదురు కర్రలు, గడ్డితో తయారు చేసే ఈ ఏనుగులు భలే ఆకర్షనీయంగా ఉంటాయి. విజయనగరంలో గజపతి వంశానికి చెందిన మహిళలు పైడితల్లికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. దసరా తర్వాత వచ్చే మొదటి మంగళవారం నిర్వహించే సిరిమాను ఉత్సవం ఆత్యద్యం సంభ్రమాశ్చర్యాలకు గురిచేస్తుంది.

మైసూర్ దసరా

దసరా ఉత్సవాలను కర్ణాటక రాష్ట్ర పండుగగా నిర్వహిస్తారు. నవరాత్రి వేడుకలను విజయదశమితో కలిపి పది రోజుల పాటు నిర్వహిస్తారు. మైసూరులో చేసే దసరా వేడుకలకు దాదాపు 500 ఏళ్ల చరిత్ర ఉంది. ఈ వేడుకలను చూసేందుకు దేశ విదేశాల నుంచి కూడా పర్యటకులు భారీ సంఖ్యలో తరలివస్తారు. ఇక్కడి దసరా వేడుకలు కేవలం అమ్మవారి పూజలకే పరిమితం కాదు. ఆ రాష్ట్ర చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలను సైతం తెలియజేస్తాయి. నవరాత్రుల్లో తొమ్మిదో రోజున ఈ రాచఖడ్గాన్ని ఏనుగులు, గుర్రాలు, ఒంటెలతో కలిపి ఊరేగింపుగా తీసుకువచ్చి, పూజలు చేస్తారు. మైసూర్ ప్యాలెస్ నుంచి బన్నీ మంటపా వరకు నిర్వహించే ఈ ఊరేగింపు అద్భుతంగా ఉంటుంది.

– బోస్

నవరాత్రుల్లో దేవీ పూజ ప్రాధాన్యం



జగన్మాత ఉపాసనకు నిర్వహించే కార్యక్రమాలే శరన్నవరాత్రులుగా ప్రాచుర్యం పొందాయి. ఆశ్వయుజానికి మరోపేరు ఇష మాసం. అశ్వనీ నక్షత్రంతో కూడిన పౌర్ణమి వచ్చే మాసం కాబట్టి ఇది ఆశ్వయుజ మాసం అయింది. మనసు నిర్మలం కోసం మహర్షులు ఉపదేశించిన మార్గాల్లో శక్తి ఆరాధన అతి ముఖ్యమైంది. పరమేశ్వరి, పార్వతి, గాయత్రి, మహాకాళి, మహాలక్ష్మి, మహా సరస్వతి, కనకదుర్గ, లలిత, రాజరాజేశ్వరి.. ఇలా ఏ పేరుతో పిలిచినా ఆయా రూపాల్లో ఉండే 'పరాశక్తి' ఒక్కటే. శక్తిని ఆరాధించేందుకు మహర్షులు నిర్ణయించిన కాలం ఆశ్వయుజం. శరద్రుతువులో ఈ మాసం వస్తుంది. వర్షాలు కొద్దిగా తగ్గుముఖం పట్టి ప్రకృతికి కొత్త శోభను సంతరించుకునే ఈ మాసంలో వెన్నెల అత్యధికంగా కాస్తుంది.

తొలి పది రోజుల్లో జరుపుకునే దేవీ నవరాత్రులు అనేక రుగ్మతలను నివారించి, విజయాన్ని చేకూరుస్తాయని పురాణాలు పేర్కొంటున్నాయి. శరద్రుతువులో కాచే వెన్నెల కాంతి, చల్లని చూపు, మందహాసం, ముఖపద్మం కలిగినదిగా పరాశక్తిని అభివర్ణిస్తారు. పది జన్మల పాపాలను పోగొట్టే నవరాత్రుల్లో మొదటి మూడు రాత్రులు పార్వతి, మధ్య మూడు రోజులు లక్ష్మి, చివరి మూడు రోజులు సరస్వతిని ఆరాధిస్తారు. ప్రకృతి నియమాలను అనుసరించి శరత్కాలం సంధికాలం. అనారోగ్యాన్ని కలిగించి, ప్రాణాలను హరించే శక్తి ఈ కాలానికి ఉంటుంది. బాధలకు గురికాకుండా జగన్మాతను వేడుకుంటూ చేసే ఉత్సవమే నవరాత్రి ఉత్సవం. హస్తా నక్షత్రంతో కూడిన జ్యేష' దశమికి దశహరా అనే పేరు ఉంది. పది జన్మల పాపాలను పొగొట్టేది అని కూడా అర్థం.

నవరాత్రుల్లో దుర్గాదేవిని జన్మజన్మల పాపాలు, బాధలు దూరం అవుతాయని నమ్మకం. రాత్రి అంటే తిథి అనే అర్థం ఉంది. దీని ప్రకారం ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి నుంచి నవమి వరకు జరిగే ఉత్సవాలే నవరాత్రి ఉత్సవాలు. తొమ్మిది రోజుల పాటు నియమాల ప్రకారం అర్చనలు చేయలేని వారు చివరి మూడు రోజులు అష్టమి, నవమి, దశమి రోజుల్లో అయినా దేవిని అర్చిస్తే, అమ్మవారి అనుగ్రహం కలుగుతుంది. మూలా నక్షత్రంతో కూడిన షష్ఠి' లేదా సప్తమి రోజున సరస్వతీదేవిని పూజిస్తారు. ఈ రోజున పుస్తకదానం చేస్తే ఉత్తమ ఫలితం పొందుతారు. దశమి రోజున వేద పండితులు, బ్రాహ్మణులను సత్కరించడం ఆనవాయితీగా వస్తోంది. శైలపుత్రి, బ్రహ్మచారిణి, చంద్రఘంట, కూష్మాండ, స్కందమాత, కాత్యాయిని, కాలరాత్రి, మహాగౌరీ, సిద్ధిధాత్రీలను నవదుర్గలుగా పిలుస్తారు. ఈ నవదుర్గలకు సానుకూలంగానే భక్తులు శైలపుత్రి- గాయత్రీదేవి, చంద్రఘంట-అన్నపూర్ణ కూష్మాండ-మహాలక్ష్మి, స్కందమాత- లలితా త్రిపురసుందరి, కాత్యాయిని - సరస్వతీదేవి, కాలరాత్రి- దుర్గాదేవి, మహాగౌరి-మహిషాసురమర్దని, సిద్ధి ధాత్రి- రాజరాజేశ్వరీదేవిగా అలంకరించి కొలుస్తారు.

మహోన్నత మానవతావాది కలామ్



(ఈనెల 15న కలాం 87వ జయంతి సందర్భంగా)

మహోన్నత మానవతావాది, ప్రముఖ మిస్సైల్ శాస్త్రవేత్త, ప్రజల రాష్ట్రపతిగా కొనియాడ బడిన డాక్టర్ అవుల్ పకీర్ జైనులబ్దీన్ అబ్దుల్ కలాం 1931 అక్టోబరు 15న జన్మించారు. తమిళనాడులోని రామేశ్వరంలో పుట్టిపెరిగిన ఆయన తిరుచిరాపల్లిలోని సెయింట్ జోసెఫ్ కళాశాలలో భౌతిక శాస్త్రం అభ్యసించారు. చెన్నైలోని మద్రాసు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుంచి ఏరోస్పేస్ ఇంజనీరింగ్ పట్టాపొందారు. భారత రాష్ట్రపతి పదవికి ముందు, డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ ఆర్గనైజేషన్, ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ (ఇస్రో)లో ఏరోస్పేస్ ఇంజనీర్‌గా పనిచేశారు. భారతదేశ మిస్సైల్ మ్యాన్‌గా పిలవబడే కలాం బాలిస్టిక్ క్షిపణి, వాహన ప్రయోగ టెక్నాలజీ అభివృద్ధికి కృషిచేశారు. 1998లో భారతదేశ పోఖ్రాన్ అణు పరీక్షలలో కీలకమైన, సంస్థాగత, సాంకేతిక పాత్ర పోషించారు. 2002 అధ్యక్షఎన్నికలలో భారతీయ జనతా పార్టీ అభ్యర్థిగా ప్రతిపాదించగా, ప్రతిపక్ష కాంగ్రెస్ మద్దతు తెలిపింది. 2020 నాటికి భారతదేశాన్ని ఒక అభివృద్ధి చెందిన దేశంగా మార్చడానికి అభివృద్ధి ప్రణాళికలు సూచించారు.

మిస్సైల్ శాస్త్రవేత్త కలాం

మద్రాస్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుంచి పట్టా పొందిన కలాం 1960 లో డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ ఆర్గనైజేషన్‌లో ఏరోనాటికల్ శాస్త్రవేత్తగా చేరారు. కలాం భారత సైన్యం కోసం ఒక చిన్న హెలికాప్టర్ చెయ్యటం ద్వారా తన వృత్తిని ప్రారంభించాడు, 1969 లో, భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ లో (ఇస్రో) చేరి, మొట్టమొదటి స్వదేశీ ఉపగ్రహ ప్రయోగానికి డైరెక్టర్‌గా పనిచేశారు. ఆయన ఆధ్వర్యంలోనే 1980 జూలైలో రోహిణి ఉపగ్రహాన్ని భూమి దగ్గర కక్ష్యలో విజయవంతంగా చేర్చింది. ఇస్రోలో పనిచేయడం తన జీవితంలో అతిపెద్ద విజయాల్లో ఒకటిగా ఆయన చెబుతుండేవారు. 1970 - 1990 మధ్య కాలంలో ఆయన చేపట్టిన రెండు ప్రాజెక్టులు విజయవంతం అయినాయి. జూలై 1992 నుంచి డిసెంబరు 1999 మధ్య ప్రధాన మంత్రి శాస్త్రీయ సలహాదారుగా, డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ ఆర్గనైజేషన్ ముఖ్యకార్యదర్శిగా వ్యవహరించారు. ఇదే సమయంలో జరిపిన పోఖ్రాన్ అణు పరీక్షలలో కలాం రాజకీయ, సాంకేతిక పాత్ర నిర్వహించారు.

భారత దేశపు మూడు అత్యున్నత పౌర పురస్కారాలైన పద్మ భూషణ్ (1981 లో)పద్మ విభూషణ్ (1990లో) భారతరత్న (1997 లో) లతో బాటు నలభై విశ్వవిద్యాలయాలనుంచి గౌరవ డాక్టరేట్లు, పొందిన వ్యక్తి డా. కలామ్. ఆయన శాకాహారి, మద్యపాన వ్యతిరేకి, బ్రహ్మచారి అంతేకాదు కచ్చితమైన వ్యక్తిగత క్రమశిక్షణను జీవితాంతం పాటించిన వ్యక్తి. మతఘర్షణలను నిరసించే శాంతికాముకుడు, మానవతావాది. ఆయన తిరుక్కురళ్లో చెప్పిన మార్గాన్ని అనుసరిస్తారు. ఆయన చేసే ప్రతి ప్రసంగంలోనూ కనీసం ఒక్క "పాశురం" నైనా ప్రస్తావిస్తారు. భారత దేశం అంతర్జాతీయ సంబంధాలలో మరింత దృఢమైన నిర్ణయాలు తీసుకుని నిర్ణయాత్మక పాత్ర పోషించాలని కోరుకునేవారు. ఆయన సుదీర్ఘ కాలం కృషి చేసి అభివృద్ధి చేసిన అణ్వాయుధ కార్యక్రమం భారతదేశ స్థానాన్ని సుస్థిరం చేసే సాధనాల్లో ఒకటిగా భావించారు. యువతను వెన్ను తట్టి ప్రోత్సహించే ఉద్దేశంతో తన ఆత్మ కథ 'వింగ్స్ ఆఫ్ ఫైర్' లాంటి పుస్తకాలు అనేకం వ్రాశారు. 2020 సంవత్సరానికల్లా భారత దేశాన్ని ఒక వైజ్ఞానిక ప్రబల శక్తిగా, ఆర్థికంగా అభివృద్ధి చెందిన దేశంగా మార్చడానికి ఒక కార్యాచరణ ప్రణాళికను ఆయన రూపొందించారు.

మరణం

విద్యార్థులను ప్రపంచ పౌరులుగా తీర్చిదిద్దటానికి ఆయన ఎంతగానో పరితపించేవారు. దానిలో భాగంగానే షిల్లాంగ్‌లోని ఏఐఎంలో విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న ప్రొఫెసర్ అబ్దుల్ కలాం హఠాత్తుగా ప్రసంగం మధ్యలో కుప్పకూలిపోయారు. గుండెపోటుతో కుప్పకూలిన అబ్దుల్ కలాంను స్థానిక బెథాని ఆస్పత్రికి తరలించారు. అక్కడ ఐసీయూలో ఉంచి చికిత్స అందించే ప్రయత్నం చేసినా ప్రయోజనం లేకపోయింది. 2015 జూలై 27న ఆయన కన్నుమూశారు. అప్పటికి ఆయన వయస్సు 84 సంవత్సరాలు. ఆయన మన మధ్యలేకున్నా ఆయన పాటించిన విలువలు, దేశపురోగమనానికి ఆయన నిర్దేశించిన మార్గాలు మనకు ఎల్లప్పుడూ స్ఫూర్తినిస్తాయి.

– ఖాన్

జీవితమే ఒక చదరంగం... అది మురికివాడ కావచ్చు...మాల్ దీవులు కావచ్చు... ఎత్తులకు పై ఎత్తులు తప్పనిసరి...(గుంటూరు శివారులలో ఓ మురికివాడ లో కనిపించిన దృశ్యం).

- కిరణ్ కుమార్, గుంటూరు

వరల్డ్ టీచర్ డే సందర్భం గా ఉత్తమ అధ్యాపకుడుగా సన్మానం స్వీకరించిన ప్రొఫెసర్ శ్రీనివాస్ గారు నాగార్జున యూనివర్సిటీ ప్రిన్సిపాల్ గా సూపరిచితులైన వ్యక్తి. భారత వికాస పరిషత్ ఆంధ్రప్రదేశ్ వారు ఈ సభని నిర్వహించారు

ఆకు చాటు పిందె తడిసె..

సినిమా

ఎన్టీఆర్ బయోపిక్ తాలూకు అప్ డేట్స్ అభిమానులను ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి. కొత్త సినిమాల అప్ డేట్స్ వారానికి ఒకటి ఇవ్వడమే గగనంగా మారిన పరిస్థితుల్లో ఎన్టీఆర్ పోస్టర్లు ఇప్పటికే పదిహేను దాకా రావడం సంచలనమే అని చెప్పాలి. దర్శకుడు క్రిష్ ఈ విషయంలో తీసుకుంటున్న శ్రద్ధను మెచ్చుకోవాల్సిందే. ఉదయం శ్రీదేవి లుక్ లో రకుల్ ప్రీత్ సింగ్ గురించి మిశ్రమ స్పందన దక్కినప్పటికీ కేవలం ఫోటో ద్వారా జడ్జ్ మెంట్ చేయడం సరికాదని ఫ్యాన్స్ సర్దిచెప్పుకున్నారు.

ఇక ఇప్పుడు బాలయ్య రకుల్ వర్షంలో వేటగాడు సినిమాలో ఆల్ టైం సూపర్ హిట్ సాంగ్ ఆకు చాటు పిందె తడిసె పాటకు డాన్స్ చేస్తున్న పోస్టర్ వదలడంతో నందమూరి ఫ్యాన్స్ జోష్ మాములుగా లేదు. అప్పట్లో యువతరాన్ని ఉర్రూతలూపిన పాట ఇప్పటికీ ఎవర్ గ్రీన్ అనే చెప్పాలి. గతంలో 2002లో అల్లరి రాముడు సినిమాలో జూనియర్ ఎన్టీఆర్ ఆర్తి అగర్వాల్ తో కలిసి ఇదే పాటకు స్టెప్స్ వేసిన సంగతి తెలిసిందే. ఇన్నాళ్లకు బాబాయ్ అదే పాటకు డాన్స్ చేయడం అంటే విశేషమే.

ఈరకంగా చూసుకుంటే ఆకు చాటు పిందె తడిసె పాటకు స్వర్గీయ ఎన్టీఆర్ అబ్బాయి బాలకృష్ణ మనవడు జూనియర్ ఎన్టీఆర్ వేర్వేరుగా డాన్స్ చేయడం అంటే నిజంగా చెప్పుకోదగిన ముచ్చటే. అల్లరి రాముడులో లిరిక్స్ యధాతదంగా కాకుండా మార్చి రాయించారు. ఆ మార్పు తప్ప గెటప్ కాస్ట్యూమ్స్ అన్ని సేమ్ ఉంటాయి. మొత్తానికి ఇప్పుడే వర్షంలో తడిసిన బాలయ్య రకుల్ లను చూసి తెగమురిసిపోతున్నారు బాలయ్య అభిమానులు.

విజయదశమిరోజు వర్మ 'లక్ష్మీస్ ఎన్టీఆర్'



దర్శకుడు రామ్ గోపాల్ వర్మ గతంలో ప్రకటించిన 'లక్ష్మీస్ ఎన్టీఆర్' ఆగిపోయిందనే అంతా అనుకున్నారు. కొన్ని నెలలుగా దీని గురించి అసలు ఊసే లేదు. ఓవైపు బాలయ్య 'యన్.టి.ఆర్' చకచకా విడుదలకు రెడీ అవుతుండగా.. వర్మ సినిమా గురించి అందరూ మరిచిపోయారు.. ఇలాంటి తరుణంలో రామ్ గోపాల్ వర్మ సంచలన ప్రకటనతో మళ్లీ వార్తల్లోకి వచ్చాడు. 'లక్ష్మీస్ ఎన్టీఆర్' పేరుతో తాను ఎన్టీఆర్ బయోపిక్ త్వరలోనే మొదలుపెట్టబోతున్నట్లు వర్మ ప్రకటించాడు.

ఈ చిత్రాన్ని ఇంతకుముందు నిర్మించడానికి ముందుకొచ్చిన వైఎస్సార్ కాంగ్రెస్ నేత వెనక్కి తగ్గడంతోనే వర్మ కూడా సైలెంటైపోయాడు. ఐతే ఇప్పుడు వర్మకు నిర్మాత దొరికాడు. ముంబయికి చెందిన పారిశ్రామికవేత్త బాలగిరికి చెందిన జీవీ ఫిలిమ్స్ బేనర్ మీద రాకేష్ రెడ్డి నిర్మాణంలో 'లక్ష్మీస్ ఎన్టీఆర్' రూపొందిస్తామని.. ఈ విజయ దశమికి సినిమా మొదలుపెట్టి జనవరి చివరికల్లా సినిమా షూటింగ్ పూర్తి చేస్తామని ఆర్జీవీ తెలిపాడు. అక్టోబర్ 19న సినిమాకు సంబంధించి పూర్తి వివరాలు వెల్లడిస్తామని కూడా అతనన్నాడు. ఎన్టీఆర్ లక్ష్మిపార్వతి చంద్రబాబు నాయుడులతో కూడిన పాత పోస్టరును వర్మ సోషల్ మీడియా వేదికగా పంచుకున్నాడు. 'ఎన్టీఆర్ ట్రూ స్టోరీ' అనే హ్యాష్ట్యాగ్ జోడించి ఆ విషయాన్ని వెల్లడించడం విశేషం.

ఎన్టీఆర్ బాల్యం.. ఆయన సినిమాల్లో ఎదగడం.. స్టార్ పొలిటీషియన్ కావడం.. ముఖ్యమంత్రిగా మారడం ఇవన్నీ అందరికీ తెలిసిన విషయాలే అని... ఇందులో ఏమాత్రం వివాదం అనేదే లేదని.. ఎన్టీఆర్ ముఖ్యమంత్రి అయ్యే వరకు ఏం చూపించినా అది పేలవంగా ఉంటుందని.. కానీ లక్ష్మీపార్వతి రాకతో ఎన్టీఆర్ జీవితంలో అనేక పరిణామాలు జరిగాయని.. వాటినే తాను చూపిస్తానని వర్మ ఇంతకుముందే ప్రకటించాడు. మరి వర్మ నిజంగా ఈ సినిమా తీసి జనాల ముందుకు తెస్తాడా అన్నది చూడాలి. ఏళ్లు గడిచినా నేటికీ తెలుగోళ్లు తెగ అభిమానించే ఎన్టీవోడి రెండో పెళ్లి ఫోటోను ఆయన పోస్ట్ చేశారు. అందులో చంద్రబాబు ఉండటంతో సినిమా జనాల్లో క్రేజ్ రాజుకుంటోంది.

పారా ఆసియా క్రీడల్లో భారత్‌కు ఐదు స్వర్ణాలు

న్యూఢిల్లీ : పారా ఆసియా క్రీడల్లో భారత్ జోరు కొనసాగుతోంది. శుక్రవారం జరిగిన పోటీల్లో ఐదు బంగారు పతకాలు భారత్ ఖాతాలో చేరాయి. మహిళల చెస్‌లో జెన్నితా ఆంటో, పురుషుల చెస్‌లో కిషన్ స్వర్ణ పతకాలు సాధించారు. బ్యాడ్మింటన్ మహిళల సింగిల్స్‌లో పారుల్ పర్మార్ భారత్‌కు స్వర్ణం సాధించింది. పురుషుల జావెలిన్ త్రోలో నీరజ్ యాదవ్, అమిత్ బల్యాన్ వరుసగా స్వర్ణ, రజతాలు నెగ్గారు. పురుషుల క్లబ్ త్రో ఈవెంట్‌లో అమిత్ కుమార్, ధర్మ్‌వీర్‌లు స్వర్ణ, రజతాలు దక్కించుకున్నారు. స్విమ్మింగ్ 100 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్ ఎస్10 కేటగిరిలో స్వప్నిల్ రజతం గెలిచాడు.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/s Vastitude Media Pvt. Ltd., and Printed at M/s Jagati Publications Ltd., Sakshi Press, Survey No. 766/2, Ankireddy Palem Village, Guntur Rural, 522005, Guntur Distt. A.P. and Published at 6-45/1, Rayapudi, Thullur Mandal, Guntur Distt, Andhra Pradesh-522237. Editor: Pattan Hussain Khan, RNI NO: APTEL/2015/66622, Postal Regd No: GTR/84/2016-18, Cell 7680994755, Email : rajadhanivartalu1@gmail.com